


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 13-12-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 42 సంచిక : 80 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడికైనా వెళ్లొచ్చు!

### ఎన్టీఆర్ తెదేపాను తెలుగుజాతి కోసం పెట్టారు

### తెలుగువారు ఎక్కడ ఉన్నా పనిచేస్తాం

### ప్రపంచం మొత్తం మెచ్చుకునేలా రాజధాని నిర్మాణం చేపడతాం

### జ్ఞాన భేరిలో సీఎం చంద్రబాబు



ఒంగోలు: తెలంగాణలో ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీ పడిన చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తానన్న తెలంగాణ సీఎం వ్యాఖ్యలపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడికైనా వెళ్లవచ్చు.. రావొచ్చని వ్యాఖ్యానించారు. తెలంగాణలో ఎన్నికల ప్రచారానికి తాను వెళ్లానని.. అక్కడి సీఎం కేసీఆర్ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి తనకేదో గిఫ్ట్ ఇస్తానంటున్నారని అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన జ్ఞాన భేరిలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజల్ని మెప్పించేందుకు ఎక్కడికైనా వెళ్లి.. రావొచ్చన్నారు. ఎన్టీఆర్ తెదేపాను తెలుగుజాతి కోసం పెట్టారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

కొందరు అటూ ఇటూ లాలూచీ పడొచ్చేమోగానీ.. తాము మాత్రం తెలుగువారు ఎక్కడ ఉన్నా పనిచేశామన్నారు.

ప్రపంచంలో ఎవరైనా తాజ్‌మహల్ తర్వాత ఏపీ అసెంబ్లీ గురించే మాట్లాడే పరిస్థితి వస్తుందని సీఎం అన్నారు. ప్రపంచం మొత్తం మెచ్చుకునేలా రాజధాని నిర్మాణం చేపడతామని తెలిపారు. నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని, ప్రతిఒక్కరూ దూరదృష్టితో ఆలోచించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. జ్ఞాన భేరి సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు ఆవిష్కరణలను చంద్రబాబు తిలకించారు. వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

**భాజపాకు కోలుకోలేని దెబ్బ: చంద్రబాబు**

ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో భాజపాకు కోలుకోలేని దెబ్బ తగిలిందని ముఖ్యమంత్రి, తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. మూడు రాష్ట్రాల్లో అధికారం కోల్పోగా.. మరో రెండు రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలే విజయం సాధించాయని పేర్కొన్నారు.

పార్టీ నేతలతో బుధవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో తరువాయి 2లో..

## నేడే కేసీఆర్ ప్రమాణస్వీకారం

- ఓడిన మంత్రుల స్థానంలో కొత్తవారికి అవకాశం
- పాత మంత్రుల స్థానాలు మార్చే అవకాశం



హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తెరాస ప్రభుత్వం నేడు కొలువు దీరనుంది. ఈ మేరకు పార్టీ తరపున గెలుపొందిన 88 మంది ఎమ్మెల్యేలతో తెరాస శాసనసభా పక్ష సమావేశంలో ఎమ్మెల్యేలంతా కేసీఆర్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకోనున్నారు. అనంతరం కేసీఆర్ గవర్నర్ నరసింహన్‌ను కలిసి తెరాస శాసనసభాపక్ష సమావేశంలో చేసిన తీర్మా నాన్ని సమర్పించనున్నారు. మధ్యాహ్నం తరువాయి 2లో..

## కేసీఆర్ రిటర్న్ గిఫ్ట్ ఇస్తే బాబే సీఎం అవుతారు

- జగన్, పవన్ కలుస్తారన్న నమ్మకం లేదు
- వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

**మాజీ ఎంపీ సబ్బంహరి**



విశాఖ సిటీ : దేశంలోనూ, రాష్ట్రం లోనూ ఇదే రాజకీయ పరిస్థితి కొనసాగితే తిరిగి చంద్రబాబు రాష్ట్రంలో సీఎం అవుతారని మాజీ ఎంపీ సబ్బం హరి జోస్యం చెప్పారు. రాష్ట్రానికి మేలు చేసే కార్యక్రమాలను చంద్రబాబు చేస్తున్నారన్న అభిప్రాయం ప్రజలకు ఉందని, పార్టీ పరంగా కూడా వైకాపా కంటే తెదేపాకే గెలిచేందుకు అవకాశం ఉందని చెప్పారు. తాజాగా వెలువడిన ఎన్నికల ఫలితాలపై తరువాయి 2లో..

## పార్లమెంట్ ఆవరణలో తెదేపా ఎంపీల ఆందోళన



దిల్లీ: పార్లమెంట్ శీతకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఏపీకి చెందిన తెదేపా ఎంపీలు పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు.

విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఎంపీలు అశోక్ గజపతి రాజు, టీజీ వెంకటేశ్, మురళీ మోహన్, శివప్రసాద్, కనకమేడల రవీంద్ర కుమార్, కొనకళ్ల నారాయణ, గల్లా జయదేవ్ ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

మరోవైపు శ్రీకాకుళంపై విరుచుకుపడిన తిత్లీ తుపాను విషయంలో కేంద్ర సాయంపై చర్చించాలంటూ రూల్ 377 కింద శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు నోటీసు ఇచ్చారు.

తుపాను వల్ల రూ. 3,435 కోట్ల మేర నష్టం వాటిల్లితే కేవలం రూ.539.52 కోట్ల సాయం కేంద్రం విడుదల చేయడంపై ఏపీ ప్రభుత్వం అసంతృప్తితో ఉన్న సంగతి తెలిసిందే.

## 'చంద్రబాబుకు దిమ్మతిరిగే షాకిచ్చారు'



న్యూఢిల్లీ : విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతూ పార్లమెంట్ వద్ద వైఎస్సార్‌సీపీ ఎంపీలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి మాట్లాడుతూ.. ఏపీ ప్రత్యేక హోదా కోసం రాజ్యసభలో తమ పోరాటం కొనసాతుందని అన్నారు. హోదా కోసం వైఎస్సార్‌సీపీ 2014 నుంచి పోరాటం చేస్తోందని, నోటీసులు, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. చంద్రబాబు నాయుడు మోసం వల్లనే ప్రత్యేక హోదా రాలేదని, తెలంగాణ ప్రజలు ఆయనకు దిమ్మతిరిగే జవాబిచ్చారని పేర్కొన్నారు. అదే రీతిలో ఏపీ ప్రజలు కూడా బుద్ధిచెబుతారని జోస్యం చెప్పారు.

**చంద్రబాబు నీతులు చెప్పారు..**

తెలంగాణ ప్రజలు చంద్రబాబు చెంప చెల్లుమనిపించారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణలో పోటీ చేసి ఏపీ ప్రజలను మభ్యపెట్టాలని ఆయన ప్రయత్నించారని, కానీ తెలంగాణ తరువాయి 2లో..




## ముఖ్యమంత్రి సభను విజవంతం చేయండి



భీమునిపట్నం : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భీమిలి నియోజకవర్గ పర్యటనలో భాగంగా లక్ష్మివారం మధ్యాహ్నం 2 గం.లకు తగరపువలస లో జరుగు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి అనంతరం జరిగు బహిరంగ సభలో పాల్గొంటారని పేదప్రజల సంక్షేమం కోసం అనేక పధకాలను ప్రవేశ పెట్టిన నాయుకుని భీమిలి తరువాయి 2లో..

## సన్యాసం తీసుకుంటే మంచిది

### లగడపాటి సర్వేలపై రోజా ఎద్దేవా



గుంటూరు: మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ సర్వేలు మాని సన్యాసం తీసుకుంటే బాగుంటుందని వైకాపా ఎమ్మెల్యే రోజా ఎద్దేవా చేశారు. తెలంగాణ ఎన్నికల్లో ఆయన చేసిన సర్వే శకుని పాచికలాంటిదని.. కుట్రపూరితమైనదని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీకి తరువాయి 2లో..



# తెలుగుదేశం పార్టీతోనే బిసిలకు న్యాయం జరుగుతుంది

ఎమ్మెల్యే మీసాల గీత



విజయనగరం : తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రంలో బిసిలకు న్యాయం జరుగుతుందని విజయనగరం శాసనసభ్యురాలు మీసాల గీత అన్నారు. ఈనెల30వ తేదీన రాజమండ్రిలో జరిగే జయహో బిసి సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విజయనగరం నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మీసాల గీత మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన జరిగే జయహో బిసి సమావేశానికి నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. బిసిల సంక్షేమం కోసం తెలుగుదేశం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టిందన్నారు. పార్టీ పరిశీలకుడు పిల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాలు గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఏపీకి మోసం చేసిన మోదీకి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. మూడు రాష్ట్రాల్లో బిజెపి అడ్రస్ గల్లంతయ్యిందన్నారు. పార్టీసభ్యత్వ కార్యక్రమంలో పార్టీశ్రేణులంతా చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్టీ ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు మాట్లాడుతూ బిజెపితో రహస్య ఒప్పందం చేసుకున్న జగన్, పవన్‌లకు ఎన్నికల్లోప్రజలుతగిన బుద్ధి చెపుతారన్నారు. తెలుగువారిని అవమానించిన పార్టీలతో జగన్, పవన్ అంటకాగుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఎన్నికల్లో పోటీచేసే ధైర్యం లేకుండా పిరికిపందల్లా పారిపోయిన వైకాపా, జనసేన పార్టీలకు చెందిన నాయకులు తెరాస గెలిస్తే, ఇక్కడ సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ మాట్లాడుతూ బిసిల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందన్నారు. ఈనెల30వ తేదీన రాజమండ్రిలో జరిగే జయహో బిసి సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎవ్వరు ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యదర్శి ఎస్.ఎన్.ఎం.రాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు డా.వి.ఎస్.ప్రసాద్, ఎఎంసి చైర్మన్ సైలాడ త్రినాధ్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బొద్దుల నర్సింగరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకల మురళీమోహన్, తెలుగుయువత అధ్యక్షుడు కర్రోతు వెంకటనర్సింగరావు, జడ్పీటీసీ తుంపల్లి రమణ, పార్టీ నాయకులు విజ్జపు ప్రసాద్, బలివాడ అప్పారావు, రొంగలి రామారావు, మైలపల్లి పైడిరాజు, కొండ్రు శ్రీను, గేదెల ఆదిబాబు, తోలాపి మోహనరావు, ఈగల సత్తిబాబు, గంటా పోలినాయుడు, కెంగువ శ్రీను, రాంబర్కి రాంబాబు, నేవీ రాజు, పాండ్రంకి గౌరి, కోరాడ పెంటయ్య, కిల్లాన పార్వతీ, మరడాపు పార్వతీ, పొగిరి పైడిరాజు, ఇప్పిలి అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

# చర్విత చరణం...ఖాదర్ బాబా చరణం : సూఫీ మహాత్మ అతావుల్లా షా



విజయనగరం : సూఫీ ధర్మ ఆధ్యాత్మిక పయనంలో హజరత్ ఖాదర్ వలి బాబా(ర.అ) చరిత్ర చర్విత చరణమని సూఫీ మహాత్మ అతావుల్లా షరీఫ్ షా ఖాదరీ బాబా అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక బాబామెట్టలో వేంచేసియున్న ఖాదర్ బాబా వారి 122 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వమించారు. ముందుగా ఖాదర్ బాబా వారి దర్గాను సందర్శఇంచి వారికి చద్దర్...గంధం సమర్పించారు. తప్పెటగుళ్ళ..పులివేషాలు..బ్యాంకు , సన్నాయి మేళాలతో భారీ ఊరేగింపు జరిగింది. అనంతరం విలేఖరులతో ఆయన మాట్లాడుతూ ఖాదర్ బాబా వారి ఆశ్శీవంమైన..ఆధ్యాత్మిక విధానానికి వారి ఆజ్ఞతో ..పాద దయతో అన్నదానక్రతువును 62 ఏళ్ళుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎక్కడ హీదయం నిర్మలంగా ఉంటుందో..మలినాలన్ని దూరంగా ఉంటాయో అక్కడ భక్తికి అవకాశం ఉంటుందని తల్లిదండ్రుల పాదాల వద్దనే భక్తి ప్రారంభం కావాలని వారిని గౌరవించిన నాడు మానవుడిగా జన్మ సార్థకత అవుతుందని అన్నారు. ఈ వేడుకల్లో శ్రీఅతావుల్లా షా వారిని దర్శించుకునేందుకు వచ్చిన థామస్‌పేట దుర్గా పీఠం వ్యవస్థాపకులు ఉత్తరాంధ్ర సాధుసంత్ పరిషత్ అధ్యక్షులు శ్రీ సమతానంద స్వామి మాట్లాడుతూ భూమిక నుంచి భూమి మీదకు ప్రపంచ కళ్యాణానికి వచ్చిన వారే మహనీయులని అన్నారు. వార దర్శనభాగ్యంతో ఆ నేల పుణ్యస్థలి అవుతుందని తెలిపారు. ముందుగా శ్రీ సమతానంద స్వామిజీ ఖాదర్ వలి దర్బార్ దర్శించి హిందూ దార్మిక సంప్రదాయలతో బాబావారికి ప్రత్యేక పూజలు చేసి పాదుకలు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో వైయస్సార్ సి.పి. నేతలు మజ్జిశ్రీనివాసరావు '((చిన్నశ్రీను) , జిల్లా యువజన విభాగం నాయకులు జి.ఈశ్వర్ కౌశిక్, అధ్యక్షులు సంతంరెడ్డి బంగారునాయుడు, బోడసింగ్ ఈశ్వరరావు అవనాపపు వాక్రమ్, కాళ్ల గౌరీశంకర్, విశాఖ ఉడా కార్యదర్శి శ్రీనివాసరావు, పత్రికా ఎడిటర్లు వి.వి.రమణ మూర్తి, యుగంధర్, తదితరులు, పాల్గొన్నారు. భక్తులు వేలాదిగా తరలివచ్చారు. 122 కిలోల కేక్ కట్ చేసిన అనంతరం 8వేల మందికి నిరాఘాటంగా అన్నదాన కార్యక్రమం జరిగింది.

## నాతవరంలో అయ్యన్న

# క్రికెట్ చాంపియన్స్ లీగ్ పోటీలు ప్రారంభం



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి తనయుడు విజయ్

నాతవరం : అయ్యన్న క్రికెట్ చాంపియన్స్ లీగ్ పోటీలను మంత్రి అయ్యన్న తనయుడు, అయ్యన్న యువసేన అధ్యక్షులు చింతకాయల విజయ్ బుధవారం ఫారెస్ట్ గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం నియోజకవర్గంలోని యువతకి క్రీడల యందు ప్రోత్సాహం కనిపిస్తూ మొగ్గు చూపే విధంగా ఉండేందుకే ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు పార్టీలకు అతీతంగా కుల మతాల కతీతంగా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతను ప్రోత్సహిం చేందుకు ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల యువకుల సత్తా జిల్లా, రాష్ట్ర స్థాయిలో చూపించేందుకు మంచి అవకాశ మన్నారు. కాగా మొత్తం టీమ్‌లు 24 ట్యాంకులు వచ్చాయని, మొదటి రోజు నాలుగు టీమ్‌లు ఆడాయని లింగంపేట, జిల్లేడుపూడి టీములు గెలుపొందాయని నిర్వాహకులు తెలిపారు. ఇంకా 20 టీంలు ఆడాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శింగంపల్లి సన్యాసి దేముడు, జెడ్పీటీసీ కరక సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలం అబ్బారావు, తాండవ జలాశయ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, ఆర్గనైజర్స్ చీపురుపల్లి రాజు, దివానం, గోపి, లోవ, అపిరెడ్డి కొండబాబు, బంగారు సూరిబాబు, నాతవరం యూత్ పాల్గొన్నారు.




విశాఖపట్నం - అరకు మధ్య నడిచే స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు
15 జనవరి 2019 వరకు పొడిగించటమైనది

పర్యాటకుల రద్దీ దృష్ట్యా, పండుగ / మకర సంక్రాంతి సందార్భంగా అరకు కు ప్రత్యేక రైలు సర్వీసులు పొడిగించుటకు ఈస్ట్ కోస్ట్ రైల్వే నిర్ణయించినది.

| రైలు నెం. | డిసెంబర్ - 2018 | జనవరి - 2019 |
|---|---|---|
| 08517 విశాఖపట్నం - అరకు స్పెషల్ ఎక్స్‌ప్రెస్ | 15, 16, 22, 23, 25, 29, 30, 31 తేదీలలో | 01, 05, 06, 12, 13, 14, 15 తేదీలలో |
| 08518 అరకు - విశాఖపట్నం స్పెషల్ ఎక్స్‌ప్రెస్ | | |

| 18517 విశాఖపట్నం-అరకు | | ↓ స్టేషన్ ↑ | 18518 అరకు - విశాఖపట్నం | |
|---|---|---|---|---|
| రాక | పోక | | రాక | పోక |
| - | 0850 | విశాఖపట్నం | 1800 | - |
| 0905 | 0907 | సింహాచలం | 1725 | 1727 |
| 0920 | 0922 | కొత్తవలస | 1700 | 1702 |
| 1120 | 1122 | బొర్రాగుహలు | 1453 | 1455 |
| 1150 | - | అరకు | - | 1400 |

ఈ రైలులో: థర్డ్ ఏసి కోచ్ - 1, రెండవ తరగతి ఛెయిర్ కార్ - 2, సాధారణ రెండవ తరగతి - 7, రెండవ తరగతి సీటింగ్ కమ్ లగేజి వ్యాను - 2 కోచ్‌లు వుంటాయి.



ఈస్ట్ కోస్ట్ రైల్వే

PR-404/J/18-19


## విభిన్న ప్రతిభావంతులకు

# గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ప్లాట్‌లు

మున్సిపల్ కమిషనర్ టి.వేణుగోపాల్



విజయనగరం : విభిన్న ప్రతిభావంతులకు గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ప్లాట్‌లను కేటాయించడానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ టి.వేణ ుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా సోనియా నగర్ ప్రాంతంలో కోడిరామ్మూర్తి గృహ సముదాయంలో ఎంపికైన లబ్ధిదారుల్లో ఎవరైనా విభిన్న ప్రతిభావంతులు ఉంటే, వారు సదరం సర్టిఫికేట్‌ల వివరాలతో 13వ తేదీ సాయంత్రంలోగా పురపాలక సంఘానికి దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ప్లాట్‌లను కేటాయిండం జరుగుతుందన్నారు. కావున విభిన్న ప్రతిభావంతుల కోటా క్రింద సదరం సర్టిఫికేట్లు పొందిన లబ్ధిదారులు తమకుచెందిన సర్టిఫికేట్ జిరాక్స్‌కాపీని పురపాలక సంఘానికి అందజేస్తే కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేసి వారికి గ్రౌండ్‌ఫ్లోర్‌లో ప్లాట్‌లు కేటాయించడం జరుగుతుందన్నారు. అలాగే మిగిలిన లబ్ధిదారులకు పారదర్శకంగా లాటరీ నిర్వహించి ప్లాట్‌లను కేటాయిస్తామన్నారు.

## శ్రీ శ్రీ కృష్ణదేవరాయ కాపు తెలగ బలిజ సేవాసంఘం

# సర్వసభ్య సమావేశం



గోపాలపట్నం : శ్రీ శ్రీ కృష్ణదేవరాయ కాపు తెలగ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో గోపాలపట్నం డాటాప్రో సర్వసభ్య సమావేశం ఘనంగా జరిగింది ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గంట్రెడ్డి అప్పలసత్యనారాయణ మాట్లాడుతూ కాపు సామాజిక భవనానికి కాపు కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు అయ్యాయని జీవీఎంసీ 66 వ వార్డుశివారు పద్మా నగర్లో సర్వే నం 76 లో స్థలంకూడా మంజూరుఅయ్యిందని త్వరతగతిన పనులు ప్రారంభానికి స్థానిక ఎమ్మెల్యే గణబాబు ఎంతో కృషి చేశారని ఈ 14 న స్థలపరిశీలనచేసి శంకుస్థాపన చేస్తామని కాపుల ఐక్యతకోసం 66 67 68 కుటుంబ సర్వే నిర్వహించి కాపు కుటుంబ సభ్యుల ఉన్నతి కోసం సంఘం కృషిచేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కంపర సత్తిబాబు ఉపాధ్యక్షుడు బూర్లె నరసింహనాయుడు గుల్ల మజ్జి సుబ్రహ్మణ్యం, గేదెల మురళీకృష్ణ కంపర చిన్నకోటేశ్వరరావు కోశాధికారి మేడిద రాజశేఖర్ గౌరవా ధ్యక్షుడు బొడ్డేపల్లి అచ్చం నాయుడు గొర్లె కృష్ణమూర్తి నాయుడు నవీన్ గొంతిన నాగరాజు గవర నాయుడు చింతల అప్పల నాయుడు శ్రీనివాస్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడికైనా వెళ్లొచ్చు!

ఎన్నికల ఫలితాలపై ఆయన మాట్లాడారు.

దేశంలో అనేక పార్టీల నేతల్లో భాజపాపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. దేశంలో భాజపా పాలన పోవాలి.. ప్రత్యామ్నాయం కావాలి అనేదే అందరి ఆకాంక్ష అని చెప్పారు. ఏపీకి అన్యాయం చేసిన భాజపాను దేశవ్యాప్తంగా తిరస్కరిస్తున్నారని, భాజపాయేతర పార్టీల కలయికకు తేదేపా చేస్తున్న ప్రయత్నాలకు దేశవ్యాప్తంగా ఆమోదం లభిస్తోందని అన్నారు. తెదేపాతోనే భాజపాయేతర పార్టీల ఏకీకరణ సాధ్యమని, ఇటీవల దేశవ్యాప్త పర్యటనలే అందుకు నిదర్శనమని చంద్రబాబు తెలిపారు.

రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్ ఏపీకి కొన్ని హామీలిస్తే.. వాటిని అమలు చేయకుండా భాజపా నమ్మకద్రోహం చేసిందని చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని కాంగ్రెస్ చెప్తే.. హోదా ఇచ్చేది లేదని భాజపా పేర్కొందని, అందుకే భాజపాపై పోరాటం చేస్తున్నాం అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈడీ, ఐటీ దాడులతో కేంద్రం బెదిరించాలని చూస్తోందని ఆరోపించారు. తెదేపాను ఇబ్బందులు పెట్టాలని మోదీ చాలా ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

### 'చంద్రబాబుకు దిమ్మతిరిగే షాకిచ్చారు'

ప్రజలు ఆయనకు గట్టిగా బుద్ధిచెప్పారని అన్నారు. ఏపీలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేను కొనుగోలు చేసి తెలంగాణలో ఫిరాయించిన ఎమ్మెల్యేలను ఓడించాలని చంద్రబాబు నీతులు చెప్పారని ఆయన గుర్తుచేశారు. గాంధీ విగ్రహం ముందు ధర్నా చేసిన నేతలు ఏపీకి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాగా మంగళవారం నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ ధర్నాలో రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌లతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు బొత్స సత్యనారాయణ, మిథున్ రెడ్డి, వర ప్రసాద్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లులు పాల్గొన్నారు.

# నేడే కేసీఆర్ ప్రమాణస్వీకారం

1.30కు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుంది. ముఖ్యమంత్రి ఒక్కరే ప్రమాణస్వీకారం చేస్తారా లేదా మరికొంత మంది మంత్రులుగా ప్రమాణం చేస్తారా అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. నలుగురు మంత్రులు ఓడిపోయినందున, వీరి స్థానంలో కొత్తవారిని ఎంపిక చేసుకోవడంతోపాటు ప్రస్తుతం ఉన్న వారిలో కొందరిని మార్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

## కేసీఆర్ రిటర్న్ గిఫ్ట్ ఇస్తే బాబే సీఎం అవుతారు

ఆయన విలేకరులతో మాట్లాడారు.

భాజపా రాష్ట్రాన్ని మోసం చేసిందనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చంద్రబాబు విజయం సాధించారని చెప్పారు. చంద్రబాబును ఓడించడానికి భాజపా సర్వశక్తులూ ఒడ్డుతోందని చెప్పిన సబ్బం హరి.. తెలంగాణలో తెరాస గెలుపునకు తెరవెనుక భాజపా సహకరించిందన్నారు. చంద్ర బాబుకి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడానికి కేసీఆర్ ఆంధ్ర వస్తే ఇక్కడ చంద్రబాబే గెలుస్తారని అభిప్రాయపడ్డారు. వైకాపా, జనసేన కలిస్తే రాష్ట్రంలో మంచి రాజకీయ శక్తిగా అవతరిస్తుంది.. కానీ, ఒకరి పై ఒకరు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్న నేపథ్యంలో వారిద్దరూ కలుస్తారన్న నమ్మకం తనకు లేదన్నారు. ఇద్దరిలో ఎవరో ఒకరు సీఎం కుర్చీ త్యాగం చేసే పక్షంలో మాత్రమే వారిద్దరూ జట్టు కట్టడం సాధ్యమని చెప్పారు. తన రాజకీయ పయనంపై ఒక నిర్ణయం తీసుకుంటానని, కొద్ది రోజుల్లో ఆ వివరాలు వెల్లడిస్తానని చెప్పారు.

## ముఖ్యమంత్రి సభను విజవంతం చేయండి

పర్యటనను విజయవంతం చేయవలసిందిగా కార్య కర్తలను భీమిలి డివిజన్ గంటా నూకరాజు కోరారు.

### ముఖ్యమంత్రి సభకు ఏర్పాటుల పరిశీలిస్తున్న అధికారులు

తగరపువలస జరిగే బహిరంగ సభ ఏర్పాటుల పై మంత్రివర్యులు గంటా శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన, శంకుస్థాపన కార్యక్రమాలు మరియు బహిరంగ సభకు ఏర్పాట్లను పరిశీలించారు. ఇందులో భీమిలి నియోజకవర్గ ఇన్ చార్జ్ చిక్కాల విజయ్ బాబు, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, పోలీసు కమిషనర్ మహేష్ చంద్ర లడ్డా , వుడా సెక్రటరీ శ్రీనివాసరావు, డీఆర్డీఏ పీడీ సత్యసాయి శ్రీనివాస్, ఆర్డీవో లతో కలిసి ఏర్పాట్లు, సభా స్థలములను మరియు ఇతర ఏర్పాట్లు పరిశీలించారు, అనంతరం పర్యటన వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్ డీఏ చైర్మన్ గాడు వెంకటప్పుడు, ఏఎంసీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు భీమిలి మండల పార్టీ అధ్యక్షుడు డిఏఎన్ రాజు, యరబాల అనిల్ ప్రసాద్ , భీమిలి డివిజన్ ప్రెసిడెంట్ గంటా నూకరాజు , రవ్వ వెంకట్రావు, పద్మనాభం జడ్పీటీసీ దామోదర రావు, జిల్లా అధికారులు రెవిన్యూ శాఖ అధికారులు, జోనల్ కమీషనర్ దుర్గాప్రసాద్ , తహశీల్దార్లు, ఎంపీడీవోలు మరియు ఇతర అధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సన్యాసం తీసుకుంటే మంచిది

మేలు చేయాలన్న ఆయన ఎత్తుల్ని తెలంగాణ ప్రజలు తిప్పికొట్టారని రోజా విమర్శించారు. ఈ మేరకు గుంటూరులో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. నందమూరి కుటుంబాన్ని ముఖ్యమంత్రి వాడుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణలో పార్టీని కాపాడుకోలేని చంద్రబాబు... దేశాన్ని ఏమి ఉద్ధరిస్తారని ఆమె ప్రశ్నించారు. తెలంగాణలో తలెత్తిన ఓటమే చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ లోనూ పునరావృతం కాకతప్పదని రోజా అభిప్రాయపడ్డారు.

# జిల్లా పోలీసు కార్యాలయం ప్రారంభం



కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా నూతన పోలీసు జిల్లా కార్యాలయం హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప,రాష్ట్ర డీజీపీ ఆర్పీ.ఠాకూర్ బుధవారం ప్రారంభించారు.బ్రిటీష్ కాలంనాటి పాత జిల్లా పోలీసు కార్యాలయాన్ని స్థలాభావం ,పాతబడటంతో రాష్ట్ర ప్రభుత్వం పాతభవనం ప్రక్కనే గల పోలీసు రిజర్వు మైదానంలో నూతన కార్యాలయాన్ని నిర్మించింది.ఈపోలీసు కార్యాలయాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో ప్రారంభించాలని రెండు సార్లు ముహుర్తాలు పెట్టినాగానీ ముఖ్యమంత్రికి సమయం అనుకూలించకపోవడంతో వాయిదా పడుతూ వస్తుంది. ఈక్రమంలో హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప బీజీపీ ఠాకూర్‌లు ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లా పోలీసు కార్యాలయాలను ఆధునిక సాంకేతికతతో నిర్మించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా కాకినాడలోని నూతన జిల్లా పోలీసు కార్యలయం మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక సొబగువులు సమకూర్చడం జరిగిందన్నారు.కమాండ్ కంట్రోల్ రూం ద్వారా నేర నియంత్రణ ,నగర పర్యావేక్షణ,నేరపరిశోధన ,శిక్షణ,తదితర అంశాలను పర్యావేక్షించవచ్చని తెలిపారు.అలాగే సర్పవరం గ్రామీణ సిఐ నూతన మోడల్ పోలీసు స్టేషన్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా ప్రారంభమైన మార్గశిరమాసోత్సవములు





విశాఖపట్నం : నగరంలో గల శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు 2018-19 ప్రారంభమై బుధవారానికి 5వ రోజు, ప్రతి రోజు శ్రీ చక్రనవ వర్ణార్చన లక్ష్మీహోమము నిర్వహించుట జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించు కున్నారు. మార్గశిర మాసోత్స వాలు సందర్భంగా నెల రోజులు అమ్మ వారి దర్శనంకు విచ్చేసిన భక్తులకు ప్రతిరోజు నిర్వహించు అన్నప్రసాద వితరణ, బుధవారం 1200 మంది భక్తులకు నిర్వహించుట జరిగింది. మార్గశిర మాసం మొదటి లక్ష్మీవారం సందర్భంగా అమ్మవారి దర్శనంకు విచ్చేయు భక్తుల సౌకర్యార్థం నగరం సరిహద్దున గల గ్రామీణ ప్రాంతం, వేపగుంట, గోపాలపట్నం, ఎన్ఎడి, కంచరపాలెం నుండి 1 సర్వీసును శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం నకు నిరంతరం తిరిగే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది. బస్సు దాత కెవిఎస్ఎన్.మూర్తి, కన్నతల్లి ట్రాన్స్‌పోర్టు వారి ధన సహాయంతో నడుపుట జరుగుచున్నది.

# నేటి నుంచి చిల్డ్రన్ ఫెస్టివల్

విశాఖపట్నం : నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే చిల్డ్రన్ ఫెస్టివల్-2018 అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు శ్రీరామ చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి వేదుల మధురవాణి తెలిపారు. ఈ ఉత్సవాలు కొత్తవలస సమీపంలోని శ్రీరామపురం (ఎల్.కోటమండలం, విజయనగరం జిల్లా)లో జరుగుతాయి. ఈ ఉత్సవాలను సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, స్థానిక ఎస్‌కోట శాసన సభ్యురాలు కె.లలితకుమారిలు ప్రారంభిస్తారు. ప్రముఖ గణిత శాస్త్ర నిపుణులు, ఆంధ్రవిశ్వ కళాపరిషత్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్.అవధాని ప్రధాన ప్రసంగం చేస్తారు. ప్రముఖులైన సాహితివేత్త ఆచార్య కె.మలయవాసిని, గణిత శాస్త్రవేత్త ఆచార్య సీఎన్‌రావు తదితర ప్రముఖులు పాల్గొంటున్నారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ తెన్నేటి సుబ్బారావు, న్యాయవాది వడ్లమాని శేషావతారంలు పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతాయి. వివిధ జిల్లాల నుంచి 200 పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారు. పోటీలకు హాజరయ్యే బాలలకు ఎటువంటి ప్రవేశ రుసుము లేదు. 12 అంశాల్లో 36 విభాగాల్లో పోటీలు ఉంటాయి. ఉత్తమ ప్రతిభను కనబరిచిన 5 పాఠశాలలకు, విశేషంగా రాణించిన మరో 8 పాఠశాలలకు నగదు పురస్కారాలతో పాటు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఆల్‌రౌండ్ చాంఫియన్ షిప్ ట్రోఫీలు, ధ్రువీకరణ పత్రం అందిస్తారు. పోటీల వివరాలు...ఎల్‌కేజీ నుంచి 3వ తరగతి (సబ్ జూనియర్స్), 4 నుంచి 7వ తరగతి (జూనియర్స్), 8 నుంచి 10వ తరగతి వరకూ (సీనియర్స్)గా వర్గీకరించారు. డిసెంబర్ 13 చిత్రలేఖనం, వ్యాసరచన, తెలుగు కథలు, పౌరాణిక, సాంఘిక ఏకపాత్రాభినయం, విచిత్ర వేషధారణ పోటీలు జరుగుతాయి. 14వ తేదీన కథారచన, తెలుగు పద్యాలు, శాస్త్రీయ, జానపద (వ్యక్తిగత, బృంద) నృత్యాలు ఉంటాయి. 15వ తేదీన లఘు నాటికలు, వక్తృత్వం, దేశభక్తి గేయాలు (వ్యక్తిగత, బృంద) పోటీలు అదే రోజు సాయంత్రం విజేతలకు బహుమతులు ఇస్తారు. వివరాలకు వేదుల మధురవాణి, కార్యదర్శి, శ్రీరామ చారిటబుల్ ట్రస్టు, సెల్ 9441140375, 7382090399, 9493789089 సంప్రదించవచ్చును.

# 18న ముక్కోటి ఏకాదశి సంకీర్తన మహోత్సవం

విశాఖపట్నం : గోవిందరోడ్డు, వేంకటేశ్వరమెట్టపై వేంచేసియున్న శ్రీ రాంరాం మందిరం శ్రీ రామాలయంలో శ్రీ హరేరామ సంకీర్తన భక్తబృందం వారి ఆధ్వర్యంలో రాంరాం మందిరం వ్యవస్థాపక ధర్మకర్త సుధారామయ్యమ్మ సారధ్యంలో శ్రీ ముక్కోటి ఏకాదశి సంకీర్తనా మహాయజ్ఞం శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి వారి మంగళాశాసనములతో ఘనంగా నిర్వహించదలిచినామని సంస్థ ఉపాధ్యక్షులు ఎం.వి.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్వర్గీయ విశాఖ అన్నదాత మట్టపల్లి చలమయ్య తనయులు మట్టపల్లి హనుమంతురావు ప్రారంభిస్తారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా మందిరంలో వేంచేసియున్న శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత ప్రతిష్ఠా మూర్తులకు, కళ్యాణమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ముక్కోటి ఏకాదశి సంకీర్తనా మహా యజ్ఞం 24 గంటల పాటు నిర్విరామ సంకీర్తన నిర్వహించబడు తుంది. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు నారాయణ సేవకూడా నిర్వహించడం జరుగుతుంది. కావున భక్త మహా శయులు యావన్మంది పై కార్యక్రమంలో పాల్గొని శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి అనుగ్రహాన్ని పరిపూర్ణ కటాక్షాన్ని పొంద వలసిందిగా కోరుచున్నాము. పై కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు సెల్ 9951173969 నెంబర్‌నందు సంప్రదించగలరు.

## 16న హిందూ సాంస్కృతిక సమ్మేళనం

రొలుగుంట : రొలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 16వ తేదీన హిందూ సాంస్కృతిక సమ్మేళనం జరగనున్నట్లు మండల సమరసత సేవా పౌండేషన్ సమ్మేళనం జరగనున్నట్లు మండల సమరసతా సేవా పౌండేషన్ ధర్మ ప్రచారక్ గుమ్ములూరు సత్తిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మంలో ఎన్నో సాంస్కృతిక కళలు, ఔన్నత్యాన్ని చాటే విధంగా నిర్వహిస్తున్న హరిభజనలు, కోలాటాలు, తప్పెటగుళ్ళ, సాము గరిడిలు, గంగిరెద్దులు, హరిదాసులు, భరతనాట్యం, కూచిపూడి, బుడబుక్కలవారు, జంగమ దేవర్లు, మాదిక డప్పులు తదితర కళలు ఒకే వేదికపై ప్రదర్శించేందుకు ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథిలుగా భక్తి విజయవామన మహారాజ్‌స్వామిజి, ఆత్మానంద స్వామిజి హాజరు కానునట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులను సన్మానిస్తామన్నారు.ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు, హిందూ సోదరులు తరలిరావాలి.

## పెరిగిన చలి తీవ్రత

రావికమతం : చలి తీవ్రత పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటలైనప్పటికీ మంచు వీడకపోవడంతో ద్విచక్ర వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వస్తుంది. ఏజెన్సీ ప్రాంతాన్ని తలపించేలా మంచు కురుస్తుండటంతో ఉదయాన్నే కూలీ పనులకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు జాగ్రత్తలు పాటిం చాలని వైద్యులు కోరుతున్నారు.

## సింహగిరిపై రెండవ విడత

# నృసింహాదీక్షలు ప్రారంభం



సింహాచలం : సింహగిరిపై రెండవ విడత నృసింహాదీక్షలు బుధవారం ఘనంగా ప్రారంభ మయ్యాయి మొదట విడత నృసింహాదీక్షలు శ్రీ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపా నంద సరస్వతి స్వామివారు ముఖ్య అతిధిగా హాజరై ఇంతక ముందే ప్రారంభించగా 30 రోజుల నృసింహాదీక్షలు రెండవ విడత మాలాధారణ కార్యక్రమం సింహగిరి నృసింహ మండపంలో హరినామ సంకీర్తనలు నడుమ భారీగా నృసింహ దీక్ష స్వీకరించ బోవు భక్తుల నడుమ ఘనంగా ప్రారంభ మయ్యాయి సింహాచలం దేవస్థానం అర్చక స్వాములు దీక్ష స్వీకరించబోవు భక్తులకు స్వామి తులసి మాలలు మాలధారణ చేసి దీక్షా విధానాలు అర్చకస్వాములు వివరించారు ఈ కార్య క్రమంలో కొండద్రిగువున గల వివిధ నృసింహపీఠాల స్వాములు భక్తులు భారీగా హాజరై హరినామస్మరణతో సింహగిరిపై సందడిచేశారు ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఆలయ ఏ ఈ ఓ ఆర్ వి ఎస్ ప్రసాద్ ఇతర అధికారులు అర్చక స్వాములు పాల్గొన్నారు

# ఓలా, ఊబర్ క్యాబ్ ఓనర్స్&డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



విశాఖపట్నం : కస్టమర్లకు రవాణాసౌకర్యం కల్పించేది (ఒక ప్రదేశం నుండి ఇంకొక ప్రదేశానికి తీసుకు వెళ్ళేది) మేము, క్యాబ్ మాది, లైసెన్స్ రెన్యువల్, రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ ఫీజులను, వాహనాల ఇన్సురెన్స్ ప్రీమి యంలు, కేసులు, జరిమానాలు కడుతూ ఓలా, ఊబర్ క్యాబ్‌లను సరఫరా చేస్తున్నాము. డ్రైవర్‌గా పని చేసేది మేమే కాని వచ్చిన కిరాయిలో ప్రభుత్వం, యాజమాన్యం యొక్క విధానాలు కారణంగా మాకు రావాల్సిన భాగంకూడా లేకుండా పోతుంది. దీనికితోడు రోజురోజుకి పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయి. ఓలా, ఊబర్ యాప్ సాఫ్ట్‌వేర్ వలన 25శాతం కమీషన్ తీసుకుంటున్నారు. ఇది సరైంది కాదు. వేలకు వేలు పైనాన్స్‌లు తీసుకుని క్యాబ్ నడుపుతుంటే మాకు మిగిలేదేమి లేదు. ప్రస్తుతం ఉన్న డీజిల్ ధరలను దృష్టిలో పెట్టుకుని దయచేసి ఈ క్రింది డిమాండ్‌లను పరిష్కరించవల సిందిగా కోరుతున్నాం. లేని పక్షంలో సమ్మెకి కూడా వెళ్ళబోతామని తెలియజేస్తున్నాం. అటువంటి పరిస్థితి వస్తే యాజమాన్యామే పూర్తి బాధ్యత వహించాల్సి వుంటుంది.

డిమాండ్స్ : షేర్ బుకింగ్‌లు తీసివేయాలి. క్యాన్సిలేషన్ ఫీజ్, మినీ కేటగిరి 35రూ॥లు, ప్రైమ్ కేటగిరి 45రు॥లు దీనికి ఎటువంటి స్కీంలు యాడ్ చేయకుండా డైరెక్టుగా ఇవ్వాలి. రెంటల్&ఔట్‌స్టేషన్ ఒకే కేటగిరికి తెచ్చి 10% కమీషన్ తీసుకోవాలి. మరియు ఎంబిజి స్లాబ్‌కి ఇన్‌సెంటివ్‌కు అను సంధానం చేయకూడదు. ఔట్‌స్టేషన్‌కి రాత్రి డ్యూటీకి అదనంగా 500రూ॥లు చెల్లించాలి. మైక్రో రేటు మాకు సరిపోవడం లేదు. కనుక మైక్రో రేటు ప్రతి కిలోమీటర్‌కు 12రూ॥లు మినీ రేట్‌ను ప్రతి కి॥మీ రూ॥లు14 చేయాలి. ప్రైమ్ ప్రతి కి॥మీ రూ॥లు 16కి మార్చవలెను.మరియు నిమిషానికి రూ॥లు 1.50 ఉండాలి. మైక్రో కేటగిరి కస్టమర్ డివైజ్‌లో 3 సీట్లు మాత్రమే అని చూపించాలి. కస్టమర్‌ని చేరుకున్న డ్రైవర్ క్లయింట్ లొకేషన్ చేరిన తరువాత టైం క్యాలిక్‌లేట్ అవ్వాలి. టైం డిప్లేలో కనిపించాలి. దీనికిగాను 5ని॥ల తరువాత ప్రతి ని॥నికి 2రూ॥లు బిల్లులో కలపాలి. కమీషన్ సిటీ రైడ్‌పై 15% జిఎస్‌టీతో కలిపి. తీసుకోవాలి. బేస్ స్పేర్ రూ॥లు 60 పెంచాలి. బేస్ స్పేర్‌లో నుంచి కంపెని ఎటువంటి కమీషన్ తీసుకోకూడదు.

# 18 నుంచి ఇస్కాన్‌లో ఆధ్యాత్మిక ఉత్సవాలు

విశాఖపట్నం : జగద్గురువు శ్రీల ప్రభుపాదుల వారు స్థాపించిన అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంస్థ సాగర్ నగర్ ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో సాగర్‌నగర్‌లో గల శ్రీ హరేకృష్ణ ల్యాండ్‌లో శ్రీ కృష్ణ మందిరంలో ఈ నెల 18వ తేదీ నుంచి 2 రోజులపాటు శ్రీ గీతా జయంతి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహించు చున్నామని సంస్థ పి.ఆర్.ఓ. ఎం.వి. రాజశేఖర్ పత్రికా ప్రకటనలో తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా 18వ తేదీ సాయంత్రం 5.30 గంటల నుండి రాత్రి 9 గంటలవరకు శ్రీ గీతా జయంతి సంద ర్భంగా సంపూర్ణ గీతాపారాయణతో గీతా జయంతి ఉత్సవం నిర్వ హించబడుతుంది. మరలా తిరిగి 19వ తేదీ ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటలవరకు వైకుంఠ ఏకాదశి సంద ర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయి. వైకుంఠ ఏకాదశి సంద ర్భంగా శ్రీ రాధాకృష్ణులు శ్రీ గోదా రంగనాయ కులుగా భక్తు లకు దర్శనమిస్తారు. అలాగే 7 వైకుంఠ ద్వారాల ద్వారా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం లభిస్తుంది. కావున భక్త మహా శయులు విశాఖ వాసులు యావన్మంది సాగర్‌నగర్ ఇస్కాన్‌లో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ఉత్సవాల్లో పాల్గొని సుభద్ర, బలభద్ర సమేత శ్రీ జగన్నాథ స్వామివారిని రాధాకృష్ణులను వైకుంఠ లక్ష్మి నారాయణను దర్శించుకొని తీర్థప్రసాదములు స్వీకరించి పరమాత్మ కృపకు పాత్రులు గావాల్సిందిగా కోరుచున్నాము.

# పెట్రో కస్టమర్స్‌కు మెరుగైన సేవలు

## బీపీసీ టెరిటోరియల్ మేనేజర్ సుఖేష్



వార్షికోత్సవ వేడుకలనుద్దేశించి మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్, సుఖేష్, గున్నాజీరావు, విశ్వనాథ్ తదితరులు

విశాఖపట్నం : పెట్రో కస్టమర్స్‌కు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆ సంస్థ టెరిటోరియల్ మేనేజర్ ధీరం సుఖేష్ అన్నారు. జ్ఞానాపురం నుండి డాక్‌యార్డ్ రోడ్‌లో ఫ్లైఓవర్ దాటగానే ఉన్న బీపీ వైజాగ్ పోర్టు పెట్రోల్ అవుట్ లెట్ మొదటి వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నుండి వెస్ట్ వరకు 242 ఔట్లెట్స్ ఉన్నాయని మరో 253 ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రతీ నెల 10వేల కిలోలీటర్ల పెట్రోల్, 30వేల కిలోమీటర్ల డీజిల్‌ను విక్రయిస్తున్నామని వివరించారు. పెట్రో కస్టమర్స్‌కు స్మార్ట్ పెట్రో కార్డ్స్ జారీ చేస్తామని ఈనెల 24లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొబైల్ నెంబర్‌తో కూడా పెట్రోల్, డీజిల్ పొందవచ్చునని చెప్పారు. బీపీ వైజాగు పోర్టు ఔట్లెట్ కస్టమర్స్‌కు ఇన్సూరెన్స్, పొల్యూషన్, ట్రాన్స్ఫర్ట్, ఫ్రీ ఎయిర్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అన్ని అవుట్‌లెట్స్‌ను ఆటోమేషన్ చేస్తున్నామని, డిజిటల్ సిస్టంను అమలు చేస్తున్నట్లు వివరించారు. బీపీసీ ఔట్లెట్ ఎండి టి.వి.కె.విశ్వనాథ్ మాట్లాడుతూ తమ అవుట్ లెట్ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఈనెల 12,13,14 తేదీల్లో ఇంజన్ ఆయిల్ మార్పిడికి ఎటువంటి రుసుము వసూలు చేసేది లేదని కేవలం ఆయిల్ ధర చెల్లిస్తే చాలన్నారు. ఇంజన్ ఆయిల్ మార్చుకునేవారికి ఉచిత సర్వీస్ అందిస్తామని, పెట్రోల్‌పై రూ.50లు డిస్కౌంట్ కూడా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జయభేరి చీఫ్ జనరల్ మేనేజర్ జి.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో ఏర్పాటు చేసిన బీపీ వైజాగ్ పోర్టు అవుట్‌లెట్ కస్టమర్లకు మెరుగైన సేవలు అందిస్తోందని వొల్లడించారు. వార్షికోత్సవ వేడుకలు జరుపుకోవడం ముదావహ మన్నారు. ఈ కార్యక్రమంలో బీపీసీ కంట్రోలర్ వి.వి.ఎస్.గున్నాజీ రావు, సేల్స్ ఆఫీసర్ టి.కిరణ్ కుమార్‌రెడ్డి, పెట్రోల్ బంక్ ఆపరేటర్ టి.వి.కె.విశ్వనాథ్ పాల్గొన్నారు.

# 16న కళాకారుల పిక్నిక్‌ను విజయవంతం చేయండి

## బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి గంటా



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి గంటా

విశాఖపట్నం : విశాఖ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16న జరిగే వనభోజనాల (పిక్నిక్)లో కళాకారులంతా హాజర వ్వాలని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం ఎం.వి.పి. కాలనీలో గల మంత్రి గంటా శ్రీనివాసరావు నివాసంలో పిక్నిక్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా కళాకారుల సంఘం అధ్యక్షులు కె.జనార్దన్ మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, నృత్యం, చిత్రలేఖనం, నాటకం, గానం తదితర అంశాలకు చెందిన కళాకారులు, కళాసంస్థల ప్రతినిధులు 16న ఉదయం 9 గంటలకు ముడసర్లోవ పార్కులో ఏర్పాటు చేసిన పిక్నిక్ స్పాట్‌కు హాజరు కావాలని కోరారు. ఇందులో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలతోపాటు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తామన్నారు. పిక్నిక్‌లో మంత్రి గంటా శ్రీనివాసరావు, స్వాతి ప్రమోటర్స్ అధినేత మేడపాటి వెంకట కృష్ణారెడ్డిలతోపాటు ప్రముఖ సినీ, ప్రభుత్వ అధికారులు, రాజకీయ ప్రముఖులు హాజరు అవుతారన్నారు. ఆసక్తి గల కళాకారులు మరిన్ని వివరాలకు 9848068536 సెల్ నెంబర్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో స్నేహాంజలి ఆర్ట్స్ అధ్యక్షులు వి.ఎన్.మూర్తి, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి చెన్నా తిరుమలరావు, సంఘం ఉపాధ్యక్షులు కన్నం వెంకటరమణారావు, కోశాధికారి పొట్లాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**37వవార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు రాష్ట్ర గొర్రెల మేకల ఫెడరేషన్ డైరెక్టర్ గంకల అప్పారావు వార్డు పరిధి (విశాఖ నార్త్)లో గల ఇందిరానగర్-4 గ్రామంలో నివసిస్తున్న కూండ్రపు సన్నీ బాబు అకస్మాత్తుగా నవంబర్ 11న మరణించటంతో చంద్రన్న భీమా డబ్బులు 5000/- రూపాయలు కూండ్రపు సన్నీ బాబు కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగిలిన డబ్బులు తమ బ్యాంకు అకౌంట్‌కి త్వరలోనే జమ చేయిస్తామని తెలియజేశారు.**



# వివమ్స్ అభివృద్ధికి 874 పోస్టులు మంజూరు

## రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి ఎన్ఎండి ఫరూక్

విశాఖపట్నం : విమ్స్ ఆసుపత్రలో మెరుగైన వైద్య సేవలందించేందుకు వివిధ కేటగిరీలకు చెందిన 874 పోస్టులు మంజూరయ్యాయని వాటిని మార్చి లోగా భర్తీ చేయనున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ అతిధి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ నెం.224 ద్వారా ఈ పోస్టులు మంజూరయ్యాయన్నారు. ఆసుపత్రి అభివృద్ధి, నిర్వహణ మరియు సిబ్బంది జీతభత్యాలు కొరకు రూ.39.47కోట్లును మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, పివిజిఆర్ నాయుడు, వెలగపూడి రామకృష్ణబాబు, వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర జిల్లాల తైక్వాండ్

# పోటీలు ప్రారంభం

భీమునిపట్నం : స్థానిక ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎ.పి సి.ఎం కప్ అంతర్ జిల్లాల తైక్వాండ్ పోటీలు మూడు రోజులు పాటు జరుగుతాయని ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అర్గ నైజింగ్ సెక్రెటరీ లు లలిత్ కుమార్, జి.రాంబాబు తెలిపారు. ఈ క్రీడా పోటీలకు13 జిల్లాల నుంచి 200 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో గెలుపొందిన వారు మధ్యప్రదేశ్ లో జరగబోయే జాతీయ స్థాయి తైక్వాండ్ పోటీలకు పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.




# విజయభాను

## సంపాదకీయం

### చరిత్రాత్మక విజయం

అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ సమర్థ నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర సమితి ఘన విజయం సాధించడం చరిత్రాత్మకమైనది. ప్రత్యర్థులు ఎన్ని ప్రతికూలతలు సృష్టించినా టీఆర్ఎస్ మూడింట రెండు వంతులకు పైగా సీట్లు తెచ్చుకొని విజయ దుందుభి మోగించింది. తెలంగాణ రాజకీ య అస్తిత్వానికి ప్రతీకయైన టీఆర్ఎస్‌ను ఓడించడానికి సాగిన కుట్ర తెలంగాణ ప్రజల అప్రమత్తత వల్ల విఫలమైందనవచ్చు. కొత్త రాష్ట్రాన్ని నాలుగున్నరేండ్ల పాటు పాలించిన కేసీఆర్ తెలంగాణ సమాజ అవసరాలకు అనుగుణమైన విధానాలను అనుసరించారు. అయినా ప్రతిపక్షాలు నిరంతరం అవరోధాలు సృష్టిస్తుండటంతో, తన అభివృద్ధి పథకాలపై, పాలనాతీరుపై ప్రజాతీర్పును కోరారు. ఇదే అదనుగా ప్రతిపక్షాలన్నీ కట్టకట్టుకొని టీఆర్ఎస్‌ను ఓడించడానికి చేసిన ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొట్టి టీఆర్ఎస్‌కు అండగా నిలిచారు. దీంతో కేసీఆర్ అభివృద్ధి నమూనాకు ప్రజల మద్దతు ఉన్నట్టు స్పష్టమైంది. దాదాపుగా అన్ని జిల్లాల్లో, అన్ని సామాజిక వర్గాల్లో కేసీఆర్ పాలన పట్ల ఆమోదం లభించిందని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణలో ప్రవేశించి ఇక్కడి రాజకీయాల్లో తలదూర్చాలని టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. టీడీపీకి నామమాత్రంగా రెండు సీట్లు మాత్రమే లభించాయి. హైదరాబాద్‌లో టీడీపీకి పట్టు ఉన్నట్టు సాగించిన ప్రచారం కూడా అబద్ధమని తేలిపోయింది. మిగితా రాష్ట్రాల వారీ మాదిరిగానే ఆంధ్రా మూలాలు గల వారు కూడా తెలంగాణ సంస్కృతిలో ఇమిడి పోతారని ఈ ఫలితాలు స్పష్టం చేశాయి. టీఆర్ఎస్ విజయం వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు మొదలుకొని నీటిపారుదల పథకాలన్నీ ఇకముందు కూడా కొనసాగుతాయనే భరోసా ఏర్పడ్డది.

తెలంగాణతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరిగిన మిగతా నాలుగు రాష్ట్రాల ఫలితాలు కూడా విశ్లేషించదగినవి. ఈశాన్య రాష్ట్రమైన మిజోరం లో కాంగ్రెస్ పార్టీ పరాజయం పొంది ప్రాంతీయ పార్టీ అయిన మిజో నేషనల్ ఫ్రంట్ విజ యం సాధించింది. దీంతో ఈశాన్యంలోని చిట్టచివరి రాష్ట్రాన్ని కూడా కాంగ్రెస్ కోల్పోయింది. ఈ రాష్ట్రంలో బీజేపీ ఒకేఒక స్థానం పొందగా, మిజో నేషనల్ ఫ్రంట్ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతున్నది. ఇక రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీపై కాం గ్రెస్‌దే పైచేయిగా ఉన్నది. ప్రధాని మోదీ పెద్ద నోట్లను రద్దుచేసిన నాటినుంచి ప్రజల్లో బీజేపీ పాలన పట్ల వ్యతిరేకత నెలకొన్నది. కానీ అది ఎన్నికల్లో ప్రతిఫలించకుండా ఎప్పటికప్పుడు నెట్టుకురావడంలో ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా సఫలమయ్యారు. గుజరాత్ లో బీజేపీ పట్ల తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ బీజేపీ అతి కష్టంగానైనా విజయం సాధించగలిగింది. కర్ణాటకలోనూ బలమైన శక్తిగా అవతరించగలిగింది. కానీ తాజా అసెంబ్లీ ఎన్నికల ద్వారా మోదీ మ్యాజిక్ పనిచేయడం లేదని స్పష్టమైపోయింది. బీజేపీతో ముఖాముఖి తలపడి కాంగ్రెస్ విజయం సాధించగలిగింది. అయితే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఏ ఒక్క జాతీయ పార్టీ కూడా సొంతంగా అధికారానికి రాగల సూచనలు మాత్రం కనిపించడం లేదు. రాష్ట్రంలో విజయకేతనం ఎగురవేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక జాతీయ రాజకీయాలకు దిశానిర్దేశం చేయవలసిన అవసరం ఉన్నది. కేసీఆర్ ఈ విషయాన్ని ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే స్వయంగా వెల్లడించారు. తెలంగాణలో టీఆర్ఎస్ అప్రతిహతంగా సాగుతున్న సంకేతాలు అందడంతో, ఫలితాలు వెలువకడముందే జాతీయ మీడియా కేసీఆర్ పట్ల ఆసక్తి ప్రదర్శించింది. కేసీఆర్ పరిపాలనాసరళి విలక్షణమైనది.

నాలుగున్నరేండ్ల స్వల్ప వ్యవధిలోనే తెలంగాణలో మరే రాష్ట్రంలో సాగనట్టి అభివృద్ధిని సాధించారు. ఈ అభివృద్ధి విధానాల పట్ల జాతీయస్థాయిలో ప్రశంసలు లభించాయి. ఆర్థికాభివృద్ధిలో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నది. దేశవ్యాప్తంగా వ్యవసాయరంగంలో సంక్షోభంలో ఉన్న తరుణంలో కేసీఆర్ రైతులను ఆదుకోవడానికి వినూత్న పథకాలను ప్రవేశపెట్టారు. ఇప్పుడు ఈ ఆర్థిక, వ్యవసాయ అభివృద్ధి నమూనాలనే దేశవ్యాప్తంగా అమలుచేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. మరోవైపు రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు ఉండాలని, దేశం అచ్చమైన సమాఖ్యగా వర్ధిల్లాలని ఆశిస్తున్నారు. దేశాన్ని ఇంతకాలం పాలించిన జాతీయపార్టీలు ప్రజల అవసరాలను తీర్చలేకపోయాయి. ఈ నేపథ్యం లో రెండు జాతీయ పార్టీలను తిరస్కరించి ప్రజలకు ప్రాతినిధ్యం వహించే కొత్త శక్తులు రావాలని కేసీఆర్ కోరుతున్నారు. జాతీయస్థాయిలో కొత్త రాజకీయ విలువలను, కార్యాచరణ ప్రణాళికను ప్రచారం చేయాలనేదే కేసీఆర్ ఆశయం. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, తెలంగాణ అభివృద్ధి నమూనా మరింతగా జాతీయస్థాయిలో ప్రాచుర్యం పొందడం ఖాయం. ద

# రైతుల కోసం దీక్ష చేపట్టిన సీతారాం

## ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఉద్యమం ఆగదని హెచ్చరిక



అనకాపల్లి : అనకాపల్లి మండలం టి. వెంకుపాలెం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 67, 68 పరిధిలో ఉన్న సాగుదారులకు మద్దతుగా జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం బుధవారం నుంచి దీక్షలు చేపట్టారు. రైతులకు పరిహారం ఇవ్వకుండా భూములు ఉద్యానవన శాఖకు అప్పగించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టిన తరుణంలో దానిని ఆయన పూర్తిగా వ్యతిరేకించారు. రైతులతో కలిసి భూములను సందర్శించిన ఆయన పూర్తి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో మొండిగా వ్యవహరి స్తోందని ఈ సందర్భంగా ఆయన విమర్శించారు. అంతే కాకుండా పరిహారం చెల్లించే వరకు పోరాటం ఆగదంటూ రైతులతో కలసి అదే భూమిలో బైఠాయించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రైతులకు ఎకరాకు 10 లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని మొదటి నుంచి జనసేన పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. 6 లక్షల రూపా యల పరిహారం ఇవ్వడానికి సిద్ధపడిన ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ఎలాంటి పరిహారం ఇవ్వ కుండా భూములు లాక్కుంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఎన్ని రోజులైనా సరే పరిహారం చెల్లించే వరకు ఈ దీక్షలు కొనసాగుతాయని చెప్పారు.

# కేసీఆర్‌కు అభినందనలు ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వెలమ యువజన సంఘం సభ్యులు

నర్సీపట్నం : నర్సీపట్నంలో వెలమ యువజన సంఘ నాయకుల డాక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం కేసిఆర్‌కి అభినందనల ర్యాలీ నిర్వహించారు. స్థానిక శారదానగర్ నుండి శ్రీకన్య కూడలి వరకు ర్యాలీ నిర్వహించి శ్రీకనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ రెండవసారి కూడా ఘన విజయం సాధించిన సందర్భంగా నర్సీపట్నంలో వెలమ సామాజిక వర్గం ఆధ్వర్యంలో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అభినం దనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఆయన తెలంగాణ రాష్ట్రానికి చేసిన అబివృద్ధి ఆయన గెలుపుకు కారణమైం దన్నారు. చంద్రశేఖర్‌రావు మచ్చలేని నాయకుడు అని మళ్లీ తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి మరిన్ని అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పదంలో దూసుకుపోయేలా చేయాలని కోరు కుంటున్నామని అన్నారు. ఈ ర్యాలీలో గిరిబాబు, వైసిపి నాయకులు గుడివాడ లచ్చబాబు, రెడ్డి ఫైనాన్స్ రెడ్డి, వెలమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# జగన్మోహన్ రెడ్డి నవరత్నాలు ప్రజలకు వరాలు



అచ్యుతాపురం : వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు ప్రజలకు వరాలని వైసిపి యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త యు వి రమణమూర్తి రాజు (కన్నబాబు) అన్నారు. బుధవారం మండలం లోని మల్లవరం,ఉప్పవరం ,లంకధర్మవరం ,గ్రామాలలో జరిగిన రావలి జగన్ -కావలి జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని నవరత్నాలు గురించి ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణి చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రకు వస్తున్నా ఆదరణ చూసి ప్రజలు జగన్‌ను ఎప్పుడు ముఖ్య మంత్రిని చేద్దామని ఎదురుచూస్తున్నారన్నారు. ఈ కార్య క్రమంలో వైసిపి యువనాయకులు యు వి సుకుమార్ వర్మ (తేజ),జిల్లా రూరల్ యువజన అధ్యక్షులు లాలం రాంబాబు (రాము) ,మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనువాసు రాజు, మండలపార్టీ అధ్యక్షులు మారిశెట్టి సూర్య నారాయణ ,వైసిపి నాయకులు ద్వారపురెడ్డి బాబ్జి ,నర్మాల కుమార్, పిన్నంరాజు వాసు, దేశంశెట్టి శంకరరావు, గండి బోయిన వెంకట్ చేపల శ్రీరాములు ,వాసుపల్లి శ్రీనివాసురావు, బలిరెడ్డి శ్రీను, పోలవరపు పారు నాయుడు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనసేన జిల్లా కమిటీ సభ్యులుగా అశోక్ బయపురెడ్డి నియామకం



నియామక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : జనసేన పార్టీ జిల్లా కమిటీ సభ్యులుగా (సోషల్ జస్టిస్ విభాగం) అశోక్ బయపురెడ్డిను పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు ఆ విభాగ రాష్ట్ర కన్వీనర్ తమ్మిరెడ్డి శివశంకర్ చేతులు మీదుగా నియామక పత్రం అంద చేయడం జరిగింది. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పదవి అనేది బాధ్యతతో కుడినదన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. సమాజానికి తనవంతు సేవ చేయాలనే తపనకు పార్టీ గుర్తింపు ఇవ్వటం సంతోషాన్ని ఇచ్చిందని, మంచి అవగాహనతో చేసే రాజకీయం మంచి నాయకత్వ లక్షణాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ తమ్మిరెడ్డి శివశంకర్, నాయకులకి కృతజ్ఞతలు తెలిపారు.

# గీతంలో ఇన్‌స్పైర్ శిబిరం ప్రారంభం

## కళాశాలల విద్యార్థులకు ప్రభుత్వ ఇంటర్న్‌షిప్



సాగర్‌నగర్ : సైన్స్ పట్ల విద్యార్థులలో ఆసక్తిని పెంచడానికి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతక విభాగం (డిఎస్‌టి) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 12 నుంచి 16వ తేదీ వరకు ఇన్‌స్పైర్ పేరిట కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని బుధవారం గీతం విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్:.ప్రసాదరావు ముఖ్యఅతిధిగా హజరై ప్రారంభించారు. సాంకేతిక ప్రగతికి గణితం, భౌతిక, రసాయన జీవ శాస్త్రాలు మూలం అని పేర్కొన్నారు. ఇన్‌స్పైర్ పేరిట కళాశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అరుణలక్ష్మి మాట్లాడుతూ సైన్స్ అంటే అన్వేషణ అని విద్యార్థులు ప్రతి విషయాన్ని శోధన దృష్టితో తెలుసుకుంటే విజ్ఞాన శాస్త్రం పై అసక్తి పెరుగుతుందన్నారు. ఇన్‌స్పైర్ కార్యక్రమంలో ప్రసిద్ధ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె.ఆర్. ప్రసాద్ నిత్య జీవితంలో రసాయన శాస్త్రం ప్రాధన్యతను వివరించారు. ప్రకృతి నుంచి సంప్రదాయ వైద్య మూలకాలను గుర్తించడం ప్రయోగ శాలలలో కృత్రిమ మూలకాల తయారిని ఆసక్తి కరంగా వెల్లడించారు. పంజాబ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎస్.కె.మెహతా మాట్లాడుతూ ప్రాథమిక శాస్త్రాలు దేశ ఆర్థిక ప్రగతికి ఉపయోగపడతాయన్నారు.నానోటెక్నాలజీ వల్ల ప్రయోజనాలు వివరించారు.

కార్యక్రమంలో గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, యు.జి.సి. వ్యవహారాల డైరక్టర్ ప్రొఫెసర్ సి.హెచ్.రామకృష్ణ, బయోటెక్నాలజీ విభాగం అధిపతి డాక్టర్ అనిత పాల్గోని ఉద్దేశ్యాలను వివరించారు. వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గోన్నారు.

# రిపబ్లిక్ డే పెరేడ్‌కు గీతం ఎన్.సి.సి.విద్యార్థిని



సాగర్‌నగర్ : వచ్చే ఏడాది జనవరి 26వ తేదీన దేశ రాజధాని ఢీల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే పెరేడ్‌లో పాల్గోనే అవకాశం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎన్‌సిసి కెడెట్ స్వాతి సమంతా రే కు దక్కింది. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ద్వారా బిటెక్ బయోటెక్నాలజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న స్వాతి సమంతారే రాజ్‌పథ్‌లో జరిగే రిపబ్లిక్ డే పెరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గోనున్నదని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎన్‌సిసి బాలికా విభాగం అసోసియేట్ ఎన్‌సిసి అధికారిణి లెఫ్టినెంట్ డాక్టర్ వి.పరిమళా వేణు తెలిపారు. గీతం లోని ఎన్‌సిసి బాలికా విభాగం ద్వారా ఏటా 30 మంది కెడెట్‌లు సి సర్టిఫికేట్ సాధిస్తున్నారని, గత ఏడాది ఇండియన్ నేవీకి గీతం ఎన్‌సిసి కెడెట్ సి.హెచ్.అనూషా ఎంపిక అయ్యారని ఆమె తెలిపారు. ఫైరింగ్‌లో సహితం గీతం బాలికా ఎన్‌సిసి కెడెట్‌లు ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు. కాగా రిపబ్లిక్ డే పెరేడ్‌కు ఎంపికయిన స్వాతి సమంతా రే ను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాద్‌రావు, ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎమ్.పోతరాజు తదితరులు అభినందించారు.



కష్టకాలంలో పార్టీ శ్రేణులను ఆదుకొని అండగా ఉంటామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బరోసా ఇచ్చారు. టీడీపీ సీనియర్ నాయకులు 3వ వార్డు మాజీ అధ్యక్షుడు పైలా నాగేశ్వరరావు ఇటీవల ఒ ప్రమాదంలో గాయపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్ర టీడీపీ నాయకులు నజీర్‌తో కలిసి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు.

# సాయిబాబా చిన్న కథలు

## సంకీర్తన



### మే.. మే.. మే..

శ్రీ రామచంద్రుడు రావణ వధానంతరం పట్టాభిషిక్తుడై రాజ్యపాలన చేస్తున్నాడు. కైక మహారాణి రాముని వద్దకు వెళ్లి, "నాయనా! నావలననే గదా నీకు అనేక కష్టములు కలిగినవి.

అభిమాన, మమకారములచే నిన్ను బాధపెట్టాను. ఈ పాప పరిహారమునకు ఏదైనా ఒక మార్గమును ఉపదేశించు" అని అడిగింది.

శ్రీరామచంద్రుడు "అమ్మా! నీవు కోరినట్లే చేస్తాను. నీవు ముందుగా సరయూ నది తీరమునకు వెళ్లి స్నానమాచరించి, అక్కడ చుట్టు ప్రక్కల ఏమి కనబడుతాయో, ఏమి వినబడుతాయో, ఏమి జరుగుతుందో గమనించు" అన్నాడు.

కైక తన చెలెకత్తెలతో సరయూ నదిలో స్నానం చేసి, చుట్టు ప్రక్కల అంతా కలయచూసింది. అక్కడ గొర్రెలు, మేకలు పచ్చగడ్డిని మేస్తున్నాయి. మేకలు నిరవధికంగా మే.. మే.. మే.. అని అరుస్తున్నాయి. ఆమె అంతఃపురము చేసింది. శ్రీరామచంద్రుడు ఆమెతో "అమ్మా! సరయూ నదీ తీరమునకు వెళ్లితివా? అక్కడ ఏ మృగములున్నాయి?" అని ప్రశ్నించాడు. కైక "నాయనా! అక్కడ మేకలు, గొర్రెలు మేస్తున్నాయి. అవి ఏమి చేస్తాయి? మే.. మే.. మే.. అని అరుస్తున్నాయి. అది వాటి స్వభావమే కదా!" అన్నది. అప్పుడు శ్రీరాముడు 'మే అంటే ఏమిటి?' అని అడిగాడు. ఆమె ఏమీ బదులు చెప్పలేదు. శ్రీరామచంద్రుడు 'మే' అంటే నేను ఎవరు? అని అర్థము. మేకలు కూడా నేనెవరు? నేనెవరు? అని విచారణ సలుపుతున్నాయి. మానవులు గొర్రెలు, మేకలు కన్నా శ్రేష్ఠులు కదా! మరి మానవులు కూడా "నేనెవరు" అని గుర్తించడానికి ప్రయత్నించాలి. లేకుంటే గొర్రెల కంటే హీనము" అని అన్నాడు.

ఈనాడు అందరూ నీవెవరు? వారెవరు? అనే ప్రశ్నలు వేస్తున్నారే తప్ప, నేనెవరు అని ప్రశ్నించుకోవడం లేదు. నేనెవరు అంటూ పుట్టి, నేనెవరు అంటూ గిట్టి ఏమి లాభం? కోఅహం అంటూ పుట్టి, సోఅహం అంటూ మరణించాలి.

### 'అమృతస్య పుత్రః'

ఒక దినము చైతన్య మహాప్రభువు ఇంటి ముందు గడపకు అవతల ఒక వ్యక్తి మురికి పట్టిన శరీరముతో, చింపిరి గుడ్డలతో, జడలు కట్టిన శిరోజములతో కన్నులు మూసుకుని నిల్చుని ఉన్నాడు.

అతనిని చూచి చైతన్య మహాప్రభువు బయటకు వచ్చి "నాయనా! నీవు ఎవరు? ఎందుకు ఇక్కడ నిల్చున్నావు? లోపలికి రావచ్చును కదా! రా!" అని ఆప్యాయంగా పిలిచాడు.

...సశేషం



రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 విజయభాను క్లాసిఫైడ్స్ Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2560004

## భూ పరీక్షా కార్డుల ప్రకారం సూక్ష్మ పోషకాలు : జిల్లా కలెక్టర్



విజయనగరం : జిల్లాలో భూ పరీక్షా కార్డుల ప్రకారం సూక్ష్మ పోషకాలు ప్రతీ రైతుకు సక్రమంగా అందించాలని జిల్లా కలెక్టర్ ఎంజహరిజవహర్‌లాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలక్టర్ సమావేశ భవన్‌లో మండల స్థాయి అధికారులతో నిర్వమించిన వీడియో సమావేశంలో మాట్లాడుతూ రబీలో రైతులకు రుణాలు సక్రమంగా అందే విధంగా బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. రైతులకు 855 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించామని ఇప్పటికే 389 కోట్ల రుణాలు మంజూరు చేసామని కౌలురైతులకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. అవసరమైన యంత్ర పరికరాలను సకాలంలో అందించాలన్నారు. ఈ-పంట నమోదు వేగవంతం చేయాలన్నారు. జీరో బడ్జెట్ సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించాలని కోరారు. జిల్లాలో 12, 874 హెక్టార్లలో సేంద్రియ వ్యవసాయం చేయాలని లక్ష్యం నిర్దేసించామని ఇప్పటికే 8,704 హెక్టార్లలో చేస్తున్నామని తెలిపారు. రుణ మాఫీ చేయవలసిన రైతులు ఎవరైన ఉంటే వారందరికి నూరుశాతం రుణమాఫీ పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ ఎ.పి,పెరికల్చర్ వాఖల పని తీరు సమీక్షించారు. సంయుక్త కలక్టర్ -2 జె.సీతారారావు, వ్యవసాయ వాఖ జెడి లీలావతి ఉద్యానవన శాఖ డి.డి. శ్రీనివాసులు, ఎపిఎంఐపి పిడి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి నెట్ బాల్ పోటిలకు సన్ స్కూల్ విద్యార్థిని



భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్ పదవతరగతి చదువుచున్న విద్యార్థిని కె.రేవతి అండర్ 17 నెట్ బాల్ బాలికల విభాగం లో చత్తీస్ ఘర్ లో జరిగే లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి.శ్రీనివాసరావు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థిని పి.ఇ.టి.అరుణ్ కుమార్ లను అభినందించారు.

## అమాయిక గిరిజన ప్రజలను అరెస్టు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారు



అనంతగిరి : క్రీ. శే. అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశరావు మాజీ ఎమ్మెల్యే సివేరి సోమల పై మావోయిస్టులు కాల్చి చంపిన రోజున అరుకు డుంబ్రిగూడ పోలీస్ స్టేషన్ల పై దాడి ఘటనలో ఎ 1 ఎ2 ప్రధమ ముద్దాయిలుగా ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులను వదిలేసి అమాయిక గిరిజన ప్రజలను పోలీసులు అరెస్టు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని గిరిజన సంఘం నాయకులు దీసరి గంగరాజు మొసియ కొండలరావు బుద్రయ్య అన్నారు ఇప్పటికైనా దాడికి పాల్పడిన తెలుగుదేశం నాయకులను అరెస్టుచేసి అమాయకగిరిజనులను విడిచిపెట్టాలని ఇలాజరగని పక్షంలో పోలీసుల పై ఉన్న నమ్మకం సన్నగిల్లుతుందని తెలిపారు వెంటనే ప్రధమ ముద్దాయిలుగా ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులను అరెస్టు చెయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు మండలంలో విద్యార్థులు

నాతవరం : మండల స్థాయిలో జరిగిన చెకుముకి పోటీలకు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారని నాతవరం మండల జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి గంటేడ అప్పలరాజు తెలిపారు. 7వ తేదీన జరిగిన మండల స్థాయి చెకుముకి పోటీలలో ఇంగ్లీషు మీడియం విభాగంలో మర్రిపాలెం కెజిబివి విద్యార్థినులు సిహెచ్.యమునా భారతి(8వ తరగతి), కె.నాగసత్య, ఎం.కుమారి ప్రధమ స్థానం సాదించగా ద్వితీయ స్థానం ఎంబి.పట్నం జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థి నిలిచిందన్నారు. తెలుగు మీడియం విభాగంలో ఎంబి.పట్నం జెడ్‌పిమెచ్‌ఎస్ విద్యార్థులు చిటికెల రాజేష్, గాలి మురళీకృష్ణ, వేములపూడి రాజేష్ ప్రధమ స్థానం సాధించగా చమ్మచింత జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. మండల స్థాయిలో ప్రధమ స్థానంలో నిలిచిన గ్రూపులు ఈ నెల 16వ తేదీన అనకాపల్లిలో జరిగే జిల్లా స్థాయి చెకుముకి పోటీలల్లో పాల్గనాలని తెలిపారు. అనకాపల్లి వివేకానంద జూనియర్ కళాశాలలో ఉదయం 9.30గంటలకు పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయిలో బహుమతులు, ప్రశంసాపత్రలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

# మెగా లేఅవుట్ ఒక రియల్ దందా



అనకాపల్లి : సత్యనారాయణపురం మెగా లేఅవుట్ నిర్మాణం ఒక రియల్ ఎస్టేట్ దందా మాదిరి తయారైందని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం తీవ్ర స్థాయిలో విమర్శించారు. బుధవారం ఆయన జనసేన కార్యకర్తలతో కలిసి లేఅవుట్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్ చాలా చిన్నగా ఉందని, బాత్రూమ్ సైజులో పడక గది ఉంటే ఒక కుటుంబం అక్కడ ఎలా నిద్రపోతుందో చెప్పాలన్నారు. అలాగే సబ్సిడీ మినహాయించిన ధర ప్రకారం చదరపు అడుగుకు 1100 రూపాయల నుంచి 1200 రూపాయల వరకు చెల్లించాల్సి ఉందన్నారు. ఇదే ధరకు బయట మార్కెట్లో కూడా ఇళ్లు దొరుకు తున్నాయన్నారు. అలాంటి తరుణంలో ఇక ప్రభుత్వం చేకూరు స్తున్న ప్రయోజనం ఏముందని ప్రశ్నించారు. దీనికి బదులుగా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే ఏదో బాధపడి అనువుగా నిర్మాణం చేసుకునే అవకాశం ఉండేదన్నారు. కానీ అలా కాకుండా కేవలం ఎన్నికల మాయలో భాగంగా అసలు ధరను రెట్టింపు చేసి పెంచిన ధరనే సబ్సిడీగా ఇచ్చి ప్రభుత్వం మోసానికి పాల్పడిందన్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉందన్నారు. పేదవాడి సొంతింటి కలను ఇలా మోసపూరిత విధానంలోనా సాకారం చేసేది అంటూ మండిపడ్డారు. ఈ హౌసింగ్ ప్రాజెక్టులో అన్యాయాలు భారీగా ఉన్నాయని ఆరోపించారు. ఎఎంసి కాలనీకి చెందిన జనసేన కార్యకర్త శ్రీకాంత్ తమ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటే ఇదే లేఅవుట్ లో ఒక ఇల్లు ఇస్తామని మభ్య పెట్టే ప్రయత్నం చేశారన్నారు. అంగీకరించి నందున బెదిరింపులకు దిగారని, అవసరమైతే ప్రభుత్వం, ఎమ్మెల్యే పీలా గోవిందు పై కోర్టులో ప్రజా వాజ్యం దాఖలు చేస్తామని హెచ్చరించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అనకాపల్లి విలేకరులకు ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేసిన తరుణంలో వెంటనే వారికి స్థలాలు వెంటనే అప్పగించాలని సీతారాం కోరారు.

## భవన నిర్మాణ కార్మికులకు పనిముట్లు పంపిణీ

### ముఖ్య అతిథిగా ఎమ్మేల్యే బండారు హాజరు

పరవాడ: భవననిర్మాణ కార్మకులుకు కార్మకశాఖఅద్వర్యంలో ఉచితంగా పనిముట్లునుపంపిణీచేసారు. పరవాడమండలపరిషత్ కార్యలయంలో జరిగిన ఈకార్యక్రమానికి స్దానికశాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ముఖ్యఅతిథిగాహజరై అయనచేతులు మీదగా పంపిణీచేసారు. అనంతరము అయన మాట్లడుతూ భవన నిర్మాణకార్మికుల సంక్షేమముకోసము ప్రభుత్వము అనేకపథకాలును ప్రవేశపెట్టిందనిఅన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఈఅవకాశాన్ని సద్వినియోగము చేసికోవాలని అయన అన్నారు. మెత్తము మీద సుమారు యాభైమంది కార్మకులుకు 3500రూపాయలు విలువచేసే పనిముట్లుకిట్లును అందజేసారు. అనంతరము ఒంటరిమహిళకు పించన్లును అందజేసారు. గ్రామపంచాయితీ అదికార్లుకు చెత్తనుండిసంపదను తయారుచేసే ఇన్సులేటర్లును అందజేసారు.ఈకార్యక్రమంలో జిల్లాప్రాదేశిక సభ్యులు పైలజగన్నాదరావు, ఎంపిపి మాసవరపు అప్పల నాయుడు, ఎమ్అర్ఒ కెవివి శివ, మండల విద్యాశాఖ అదికారి సునీత, ఎమ్ పిడిఒ కరుణాకుమారి,ఇఒఅర్ డి హేమసుందర్, కార్మకశాఖ అదికారి నాగేశ్వరావు, తాజా మాజీ సర్పంచ్ గోర్లికనకారావు, జిల్లాతెలుగుయువతఅర్గనైజింగ్ కార్యదర్శి వియ్యపుచిన్నా,రాష్టఅటవీశాఖ అబివృద్ది డైరక్టర్ మాదంశెట్టి నీలబాబు, ఎంపిటిసిసభ్యులు పైల సన్యాశిరావు, ఇందల కొండలరావు,ఇ.బోనంగి మాజీవైస్ సర్పంచ్ బుగిడిగోవింద టిడిపి మండలప్రదానకార్యదర్శి పైలరామచంద్రరావు, జన్మభూమి కమిటిమెంబర్ రెడ్డిశ్రీనువాసురావు మరియు మండలములో గల ఎంపిటిసిలు, తాజామాజీసర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

## మైలాన్ సేవలు ప్రశంసనీయం : ఎమ్మేల్యే బండారు



పరవాడ: మండలకేంద్రమైన పరవాడలో గలప్రాదమిక అరోగ్యకేంద్రములో డయేరియా వార్డుకు మైలాన్ లేబొరేటీరిస్ లిమిటిడ్ వారి అర్దిక సహయముతో మూడులక్షలయాభై వేలు విలువచేసే వైద్యపరికరాలును స్దానిక ఎమ్మేల్యే బండారుసత్యనారాయణమూర్తి చేతులుమీదగా ప్రారంభించారు.అనంతరముఅయన మాట్లడుతూ మైలాన్ కంపెనీ సేవలును కొనియాడారు. పరవాడ వైద్యాదికారణి డాక్టర్ ప్రమీల పనితీరును ఎమ్మేల్యేబండారు అభినందించారు.ప్రవేట్ అసుపత్రికిదీటుగా పరవాడప్రభుత్వఅసుపత్రిలో వైద్యసేవలు అందుతున్నాయని అయన అన్నారు. అదేవిదంగా అసుపత్రికి అంబులెన్స్ ను మంజూరుచేయడము జరిగిందని అన్నారు.ఈకార్యక్రమంలో జిల్లాప్రాదేశికసభ్యులు పైల జగన్నాధ రావు, ఎంపిపి మాసవరపుఅప్పల నాయుడు,మైలాన్ కంపెను హెడ్ సునీల్ రాయ్ వాద్వా, డాక్టర్ ప్రమీల, అటవీశాఖఅబివృద్ది డైరక్టర్ మాదంశెట్టి నీలబాబు, అసుపత్రి చైర్మన్ బొండాఅప్పారావు మాష్టర్ , టిడిపి సినియర్ నాయకులు పైలసన్యాశిరావు మాష్టర్, పైలరామచంద్రరావు,రెడ్డిశ్రీనువాసురావు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ పందెం రాయుళ్ళు అరెస్ట్



రావులపాలెం : ఇటీవల కాలంలో పెచ్చుమీరుతున్న పందెంరాయుళ్ళకు అడ్డుకట్ట వేసేవిధంగా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిన నేపద్యంలో క్రికెట్ పందాలు నిర్వహిస్తున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సిఐ బొక్కాపెద్దిరాజు, ఎస్సై సిహెచ్ విద్యాసాగర్‌లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధి కొమరాజులంక గుర్రాల రాజు ఇంటిలో రహస్యంగా క్రికెట్ పందాలు నిర్వహిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో తన సిబ్బందితో పందెశిబిరంపైకి దాడి చేసి 20-20 క్రికెట్ మ్యాచ్‌కు సంబందించి పందాలు జోరుగా సాగిస్తున్న గుర్రాల రాజు, చింతపట్ల గోవిందు, చిత్రపు వీరబాబు, మండా లక్ష్మినారాయణ, కర్రి లక్ష్మణరెడ్డి, కాకుమళ్ళ శ్రీనివాసు, దైవాల వెంకట సత్యనారాయణ, మద్దూరి రాజు, బండారు వీరబాబులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ. 45,200/- , ఒక టివి, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వీరిని కొత్తపేట జూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు హాజరు పర్చనున్నట్లు ఎస్సై తెలిపారు.

## ధార్మిక జీవితానికి మహిళలదే అగ్రస్థానం

### శ్రీశ్రీశ్రీ చినజీయర్ స్వామి



విజయనగరం : ధారిక్మకతకు మహిళలదే అగ్రస్థానమని, ఎక్కడ మహిళలు గౌరవించబడతారో అక్కడే దేవతలు సంచరిస్తారని శ్రీశ్రీశ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి ఉద్భోదించారు. బుధవారం స్థానిక డాబాతోట దగ్గర కంచికామాక్షి షో రూమ్‌ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగ ఆవేఖరులతో మాట్లాడుతూ మహిళలకు సంస్కారవంతమై అందాన్ని ఇచ్చే వస్త్రాలను అందించడంలో వ్యాపారుల ధార్మికత తెలుస్తుందని అన్నారు. వ్యక్తు సంస్కరణకు మార్గం చూపెట్టడం వల్ల సంప్రదాయాయం నిలబడుతుందని తెలిపారు.

వస్త్రం, విద్య, విధేయత స్త్రీలకు గౌరవాన్ని తెస్తాయని అన్నారు. ట్రస్ట్ ద్వారా దార్మిక ప్రచారాన్ని చేసేందుకు మహిళలకు వారి వ్యాదులపట్ల అవగామన కల్పించేందుకు సుమారు 53 లక్షల 23 వేల మందికి ఆరోగ్యంఅవగాహన కల్పించామని తెలిపారు. ఇంకా జీవనశైలి మారటం వల్ల వచ్చే కాన్సర్‌లాంటి బయంకర వ్యాధులు వ్యాపించకుండా సేవలు చేస్తున్నామని, శ్రీశ్రీశ్రీరామానుజా చార్యుల వారి సమతావాదానికి ధార్మిక జీవన శైలికి అందరూ కట్టుబడి వుండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎం.పి. బొత్స ఝాన్సిలక్ష్మి, ఎమ్మెల్యే మీసాల గీత, కోలగట్ల వెంకటరమణి, కంటకాల శిల్ప, పైడా రమా దేవి తదితరులు పాల్గొన్నారు. యాజమాన్యం స్వామివారిని ఉచిత రీతిన సత్కరించింది.

## ఒంటరి మహిళ పింఛన్లు 65 మంజూరు

గొలుగొండ : మండలంలో ఒంటరి మహిళలకు పింఛన్లు 65 మంజూరయ్యాయని ఎంపిడిఒ ఎం.వి.సువర్ణరాజు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అలాగే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందించిన లబ్ధిదారులను గుర్తించి పింఛన్లు మంజూరు చేశామన్నారు. జనవరి 2019 ఏడాది నుంచి అందిస్తామని తెలిపారు.

## వీధి లైట్లు లేక గ్రామాలు అంధకారం

కొయ్యూరు : వీధిలైట్లు లేకపోవడంతో రాత్రయితే గ్రామాల్లో అంధకారం నెలకొంటుందని చింతపల్లి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు దుశ్చరి చిట్టిబాబు, వెలగలపాలెం మాజీ సర్పంచ్ కొండమ్మ అన్నారు. పంచాయతీ ప్రత్యేకాధికారులు కనీసం పంచాయతీల్లో మౌలిక వసతులపై దృష్టిసారించడం లేదని వారు వాపోయారు. పంచాయతీ ప్రత్యేకాధికారులు అసలు గ్రామాల్లో తిరగడం లేదని చెప్పారు. అధికారులు వెంటనే స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో విద్యార్థి ప్రతిభ

యలమంచిలి రూరల్ : రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో 53 కిలోల విభాగంలో జంపపాలెం విద్యార్థి వినోద్‌కుమార్ కాంస్య పతకం సాధించాడు. ఈ నెల 9న కృష్ణా జిల్లా నందిగామలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో జంపపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి వినోద్‌కుమార్ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. ఈ మేరకు పాఠశాల పిఈటి జి.దేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

## 4 జిల్లాల్లో 208 హెచ్‌పీసీఎల్ పెట్రోలు బంకులు

### దరఖాస్తులు దాఖలుకు 24 వరకు గడువు

విశాఖపట్నం : హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాల్లో 208 పెట్రోల్ పంపుల రెగ్యులర్ / గ్రామీణ అవుట్‌లెట్ డీలర్లను నియమించనుందని హెచ్‌పీసీఎల్ చీఫ్ రీజనల్ మేనేజర్ (రిటైల్) పమ్మి రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం జిల్లాలో 87, శ్రీకాకుళం జిల్లాలో 24, విజయనగరం జిల్లాలో 23, తూర్పు గోదావరి జిల్లాలో 74 బంకులు ఏర్పాటు చేయనున్నామన్నారు. పదవతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తుదారులు భారతీయులై వయస్సు 21 నుంచి 60 ఏళ్ల లోపు ఉండాలి. ఈ నెల 24వ తేదీలోగా వాపసురాని రూ.లు 2,500 నుంచి రూ. 10 వేలు వరకు దరఖాస్తు ఫీజు ఆన్‌లైన్ చెల్లింపుతో పాటు ఆర్ఓ డీలర్‌షిప్ దరఖాస్తును ఆన్‌లైన్‌లో దాఖలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తుదారులు ముందుగా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని బ్రోచర్, నియమనిబంధనలను చదవాలన్నారు. పెట్రోల్ బంకుల్లో ఎస్‌సీ/ఎస్టీలకు 19.5 శాతం, ఓబీసీలకు 24 శాతం, ఓపెన్ 44.5 శాతం, డిఫెన్స్ పర్సనల్, పారా మిలటరీ పర్సనల్ /కేంద్ర, రాష్ట్ర పీఎస్‌యు ఉద్యోగులకు 8 శాతం, అవుట్ స్టాండింగ్ స్పోర్ట్స్ పర్సన్స్ (ఓఎస్‌పీ), స్వాతంత్ర్య సమరయోధులకు ఒక శాతం, వికలాంగులకు మూడు శాతం బంకులను కేటాయించనున్నట్లు ఆయన వెల్లడించారు. దరఖాస్తుదారులు 9494436699, 9163160110, (విశాఖపట్నం), 8886261010, 9701220999 (తూర్పు గోదావరి), 9866353587 (విజయనగరం), 8985428272 (శ్రీకాకుళం) మొబైల్ నెంబర్లను సూచనలు, సలహాల కోసం సంప్రదించవచ్చని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## సి.అర్.పిల వి.అర్.పిల వేతానాలు చెల్లించాలి

అరకులోయ : మండలంలో పనిచేస్తున్న సి.అర్.పిల,వి.అర్,పిల వేతానాలు గత రెండు మూడు నెలల నుండి ఉన్నత అధికారులు చెల్లించకుండా కాల యాపన చెయ్యడం చాల బాధ కరమనీ ఆయా పంచాయతీల వి.అర్.పిలు మరియు ఆయా పాఠశాల కాంప్లేక్స్ సి.అర్.పిలు ఆవేదన పడుతున్నామని అన్నారు.కొత్త సంవత్సరం క్రిస్మస్,సంక్రాంతి పండుగ దగ్గర పడుతుంది.జీతాలు లేవు.కుటుంబసభ్యులతో కొన్ని రోజుల పస్తులు ఉండాల్సిన పరిస్తితి అని బాధతో వాపోతున్నారు.జిల్లా అధికార యంత్రాంగం స్పందించి వెంటనే తమ వేతానాలు చెల్లించాలి అంటున్నారు.

సినిమా ఛాన్స్
త్వరలో మేము నిర్మిస్తున్న మల్టీస్టార్ చిత్రానికి నూతన నటీనటులు వెంటనే కావలెను.
95819 91533

కో-ప్రొడ్యూసర్ కావలెను
ముగ్గురు ప్రముఖ హీరోలతో మేము నిర్మిస్తున్న మల్టీస్టార్ మూవీకి సహాయ నిర్మాతలు వెంటనే కావలెను
73965 61489

IN THE HONOURABLE COURT OF III ADDITIONAL CHIEF METROPOLITAN MAGISTRATE AT GAJUWAKA
C.C.No.627/2017

Between :
Talaparthi Appala Naidu ...Complainant
And:
Pasupulati Sudhakara Rao ...Accused

SUMMONS TO THE ACCUSED

To,
Pasupulati Sudhakara Rao,
S/o.Late Rathaiah,
Residing at D.No.31-53-18/1,
Near Hanuman Temple,
Yadav Jaggarajupeta,
Vadlapudi Post,
Visakhapatnam.

Please take notice that the above named complainant have instituted the above complaint against you and the matter stands posted for your appearance you are hereby summoned to appear in the above court in person or through a pleader duly instructed and the matter stands posted to **07-01-2019 at 10:30 AM** for your appearance in default of your appearance on that day the matter will be heard and determined in your absence basing on the material available in the court.

(Vennela Eswara Rao)
M.Santhi
Advocate
Visakhapatnam.

# అభివృద్ధి పనుల పరిశీలన



యానాం: యానాంలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను, సమస్యల ప్రాంతాలను పరిశీలించారు. బుధవారం ఉదయం కనకాలపేట, ఏటుగట్టు రోడ్డు మార్గంలోని డ్యంపింగ్ యార్డు, శ్మశానవాటిక పందుల పెంపక కేంద్రాన్ని ప్రాంతాలను పరిశీలించి అక్కడ ఉన్న ఇబ్బందులను పరిశీలించారు. ఈ సందర్భంగా తీసుకోవలసిన అంశాలపైన మున్సిపాల్టి, ప్రజాపనులశాఖ అధికారులతో చర్చించారు. స్మశానవాటికలో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు ఒక స్కీమును తీసుకువచ్చి ఈ నెలాఖరులోగా రూ. 1 కోటి విడుదల చేస్తామన్నారు. మున్సిపాలిటీ, ఫైర్, ఓల్డేజ్‌హోంల ద్వారా పనులు చేయిస్తామన్నారు. డ్యంపింగ్ యార్డువలన దుర్గంధం వెదజలల్లకుండా చర్యలు చేపడతామన్నారు. లంకింగ్ ఛానల్ నిర్మాణ పనులు , జనవరి 6 లోగా పూర్తిచేయాలని ప్రజాపనులశాఖ అధికారులతో టైటిల్ లాక్ దగ్గర ఉన్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించి పైవిధంగా ఆదేశించారు. మిగిలి ఉన్న 40 మీటర్ల పనులను, విద్యుత్ పనులు సంబంధించి టెంటర్లు పిలవడం జరిగిందన్నారు. భీంనగర్, కనకాలపేట, దరియాల తిప్ప, పరంపేట, ఎస్సీ సోసైటీ భూములకు నీరు వెళ్ళేవిధంగా మరో రూ. 13 కోట్లతో కాంక్రిట్ ఛానల్స్‌ను ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఇసుక కాల్వ వెడల్పుకు మరో రూ.13 కోట్లుతో పనులు చేయిస్తామన్నారు. ఎఎఫ్‌సిడి స్కీమ్ కేంద్ర ప్రభుత్వ నుండి నిధులు తీసుకువచ్చి మిగిలిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుండి తీసుకొని యానాంలోని పాత పైపులైన్ స్థానే కొత్త వాటికి రూ. 30 కోట్లతో పనులు చేపట్టనున్నామన్నారు. కురసం పేట నుండి సావిత్రి నగర్ వరకు అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్‌కు రూ. 40 కోట్లు, కారియకల్‌కు రూ. 30 కోట్లు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ద్వారా 2019 నాటికి ఈ పనులు పూర్తిచేస్తామన్నారు. వరదవలన నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం నిధులు విడదుల చేయాలని కోరగా క్యాబినెట్ ఆమోదించిందని దీనికి గవర్నర్ పసుపు కార్డుల లబ్దిదారులను ప్రభుత్వం ఉద్యోగులను తొలగించాలని అడ్డు చెప్పడంవలన నిధులు విడుదలలో జాప్యం జరుగుతుందన్నారు. దీనిపై ప్రభుత్వం కోరిన విధంగా అధికారులు నివేదిక ఇవ్వనున్నారన్నారు.

# బియ్యం నగదు పడకపోతే ఫిర్యాదు చేయాలి

యానాం: పౌరసరఫరాల ద్వారా రేషన్ కార్డు లబ్ధిదారుడికి బియ్యం నగదు వారియొక్క అకౌంట్లకు పడకపోతే నేరుగా ఫిర్యాదు చేయవచ్చని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో కొందరు రేషన్‌కార్డు లబ్ధిదారులు రేషన్ బియ్యం నగదు పడటంలేదని దీనిపై తక్షణం చర్యలు చేపట్టాలని కోరగా ఆయన నేరుగా ఫోన్‌లో పుదుచ్చేరి సివిల్‌సప్లై డైరెక్టర్ వల్వన్‌తో చర్చించారు. 16639 రేషన్ కార్డులకు గాను రూ. 16760600 ప్రభుత్వ నిధులు మంజూరు చేయగా అందులో 15397 మందికి నగదు జమా జరిగిందన్నారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలలో మిగిలిన 669 మందికి ఇప్పటివరకు బ్యాంకు ద్వారా వారి అకౌంట్లకు నగదు జమా అవ్వలేదని దీనిపై లబ్ధిదారులు సివిల్ సప్లైయికు నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు చేయడం తెలియనివారు మంత్రి క్యాంపు కార్యాలయంలో వారి యొక్క సమస్యలను చెప్పి ఫిర్యాదు చేయవచ్చున్నారు.

నవంబర్, డిసెంబర్ నెలలో పుదుచ్చేరి ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుడికి బియ్యం ఇవ్వడానికి ప్రభుత్వం ముమ్మర ప్రయత్నం చేస్తుందన్నారు. దీనికి సంబంధించి టెండర్లు పిలవడం జరిగిందన్నారు. నగదు జమా కారణంగా ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని బియ్యం విడుదల చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. దీనిని గవర్నర్ అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

# తెలంగాణా సీఎంకు ముద్రగడ శుభాకాంక్షలు



కాకినాడ : ఇటీవల తెలంగాణా రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో అఖండ విజయం సాధించి , విజేతగా నిలచి రెండవసారి ముఖ్యమంత్రి పీఠం అధిరోహించనున్న కెసిఆర్‌ను కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం తమ శుభాకాంక్షలు తెలియజేసారు. బుధవారం కిర్లంపూడిలోని తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణాలో తెలుగుదేశం ఓటమిపై ఆయన స్పందిస్తూ చంద్రబాబును రాజకీయంగా మట్టి కరిపించిన తెలంగాణా ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎందరో త్యాగంతో తెలంగాణాను తెచ్చుకున్నారని అటువంటి తెలంగాణాలో వేలు పెట్టడం ఉంతవరకూ సమంజసమో చంద్రబాబు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ఏపీలో ఉన్న వనరులు సరిపోక తెలంగాణాలో ఉన్న వనరులపై కన్నేసిన ఆయన కుటుంబ సభ్యులకు తెంగాణా ప్రజలు తగిన బుద్ది చెప్పారాన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కెసీఆర్ వేలు పెడితే తాను స్వాగతిస్తానన్నారు. చంద్రబాబు తిరిగి అధికారంలోనికి వస్తే రాష్ట్ర నాశనమవుతుందని తెలంగాణాలో మాదిరిగా ఏపీలో కూడా చంద్రబాబుకు ముగింపు పలకాలని ప్రజలను కోరుకుంటున్నానన్నారు. చంద్రబాబును ఇంటికి సాగనంపే వరకూ తాను వదలనని అన్నారు. కేంద్రానికి పంపిన కాపు రిజర్వేషన్ బిల్లు వెనక్కి తీసుకొని కొత్త సవరణలతో బిల్లును పెట్టి ఆమోదంతో చట్టం చేయాలన్నారు. ఈ నెల 23న కత్తిపూడి వద్ద రాష్ట్ర కాపు జెఏసీ నేతలతో ఉద్యమ భవిష్యత్ కార్యాచరణపై చర్చ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు ,ఆకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలనే టి.డి.పి ప్రభుత్వ ధ్యేయం

## -మజ్జి మాలినాయుడు



మల్కాపురం: జివిఎంసి 49వ వార్డు మల్కాపురంలో గణబాబుకాలనీలో గల హుద్ హుద్ గృహాలలో నివాసం ఉంటున్న బడ్డి.శ్రీనివాస రావుకు రెండు కిడ్నిలు పనిచేయక పోవడంతో ఫించన్ కోసం ధరఖాస్తు చేసుకోగ, దీనిపై సమగ్ర విచారణ చేసిన అధికారులు శ్రీనివాసరావుకు 2500 రూపాయల పించన్‌ను మంజూరు చేశారు.

ఈ ఫించన్‌ను 49వ వార్డు టి.డి.పి ఉపాధ్యక్షుడు మజ్జి.మాలినాయుడు, 48వ వార్డు సివో శ్రీనివాస్ చేతుల మీదుగా లబ్దిదారునికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాలినాయుడు మాట్లాడుతూ పేద ప్రజలకు టి.డి.పి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రజా సంక్షేమ పధకాలు అందిం చడంలో రాష్ట్రం ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్దానిక నాయకులు రఘు, నాగరాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నేడే విశాఖలో ఆరోగ్య సదస్సు

యానాం: కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల ఆరోగ్యశాఖ మంత్రులతో సదస్సు ఏర్పాటుచేయడం జరిగిందని దానికి తాను హాజరవుతున్మట్లు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి అధ్యక్షతన జరగనున్నాదన్నారు. ఆ సమావేశం అనంతరం తాను పుదుచ్చేరి బయలుదేరివెళ్ళి అసెంబ్లీ సమావేశంలో పాల్గొని ఈ నెల 15 వ తేదీన యానాం తిరిగి రానున్నట్లు తెలిపారు. ఈ సదసులో పుదుచ్చేరికి సంబంధించిన వైద్య ఆరోగ్య సమస్యలను ఆ సమావేశంలో కేంద్రమంత్రి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళనున్నట్లు తెలిపారు.

# డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణం బలి

## శబరిమల యాత్ర ముగించుకొని వస్తుండగా బస్సు ప్రమాదం

యు.కొత్తపల్లి : ఈనెల రెండో తారీఖున మండల కేంద్రమైన కొత్తపల్లి వాకతిప్ప గ్రామ ప్రజలు అయ్యప్ప స్వామి సన్నిధికి వెళ్లి మాలను విడిచి దర్శనం ముగించుకొని తిరిగి వస్తుండగా తమిళనాడు రాష్ట్రం తిరుచి గ్రామం దగ్గర డ్రైవర్ నిర్లక్ష్యంతో బస్సు ప్రమాదం జరిగింది బస్సులో మొత్తం 39 మంది ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో వాకతిప్ప గ్రామానికి చెందిన అయిశెట్టి సూర్యకాంతం అక్కడికక్కడే మృతి చెందారు. కొంతమందికి తీవ్ర గాయాలు అయ్యాయి వారిలో పొన్నగంటి సత్యవతి, కాకి వెంకటేష్, మంచి శెట్టి అప్పన్న, కాకి గంగాధర్, మాద బత్తుల వెంకట సూరిబాబు, నక్క వెంకటేష్, దుర్గాప్రసాద్, చిట్టిబాబు వీరందరినీ తిరువూరు దగ్గర ఆర్ఎన్ఎఫ్ హాస్పటల్ ప్రథమ చికిత్స కొరకు పంపించారు. తీవ్ర గాయాలైన సత్యవతిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. మృతి చెందిన సూర్యకాంతం పోస్టుమార్టం పూర్తి చేసి ప్రత్యేక వాహనంలో మిగతా వారిని కూడా కొత్తపల్లి వాకతిప్ప గ్రామాలకు తరలిస్తున్నారని గ్రామ ప్రజలు తెలిపారు. గాయాలపాలయిన కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే వర్మ మరియు మాజీ ఎమ్మెల్యే వైయస్సార్సీపి నాయకులు దొరబాబు పరామర్శించారు.

# నిబందనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

## ట్రాఫిక్ సిఐ బాస్కరరావు

మల్కాపురం: ప్రదాన రహదారిపై ఉన్న బహుళ అంతస్తుల యజమానులకు ట్రాఫిక్ సిఐ బాస్కరరావు హెచ్చరికలు జారీ చేశారు. ఇందులో భాగంగా ప్రదాన రహదారిపై ఉన్న క్రిష్ణా బార్ అలాగే ఎస్‌బిఐ భవనాల యజమానులకు ఉత్తర్వులు అందించారు. భవన యజమానులు నిబందనలకు విరుద్దంగా వినియెగదారులు వాహనాలను పార్కింగ్ చేస్తున్న పట్టించుకోకుండా ఉంటున్నరని, అలాగే భవనాలకు సంబందించి సరైన పార్కింగ్ స్దలాన్ని కేటాయించకుండా వ్యవహరిస్తున్నారని, కావున త్వరితగతిన భవనాలకు సంబందించిన జివిఎంసి ప్లానింగ్‌ను అందజేయాలని, లేకపోతే భవన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సన్యాసిరావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న

## పశ్చిమ నియోజకవర్గ జనసేన నాయకులు డాక్టర్ పి.వి.సురేష్



మల్కాపురం: జివిఎంసి 47వ వార్డు మల్కాపురం హనుమాన్ సంజీవ కాలనీలో కూలిపని చేసుకుంటూ నివసిస్తున్న కె.పెరుమాల్లు అనే వ్యక్తికి ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి ఎడమ చేతికి గాయంఅయ్యి సహాయం కోసం ఎదురుచూస్తున్నాడని తెలుసుకున్న విశాఖ పశ్చిమ నియోజకవర్గ జనసేన నాయకులు డాక్టర్ పి.వి.సురేష్, హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టర్ అజ్మీర్‌తో కలిసి వెళ్లి పదివేల రూపాయల అర్దిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయం కోసం ఎదురుచూసే వారిని అన్నివిధాల ఆదుకుంటానని, సాయం చెయ్యడం వల్ల వచ్చే తృప్తి చాలా ఆనందానిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.వి.ఎస్.హెల్పింగ్ హేండ్స్ అభిమానులు పాల్గొన్నారు.

# వైకాప ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



మల్కాపురం: వైఎస్‌ఆర్‌సిపి విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త ఎమ్.వి.వి.సత్యనారాయణ సహయ సహకారంతో శ్రీహరిపురం కోరమాండల్ గేటు సమీపంలో ఉన్న జి.వి.ఎం.సిగ్రౌండ్స్‌లో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంబించారు. ఈ కార్యక్రమానికి 47వ వార్డు వైకాప అధ్యక్షుడు పుర్రి.సురేష్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు సరైన వైద్యం అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని బావించిన వైకాప పార్టీ ప్రజల ఆరోగ్య దృష్య చేపట్టిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని, ఇలాగే వైకాప అధికారంలోకి వచ్చాక ప్రజలు వైద్యం కోసం ఎదురుచూసే పరిస్దితి లేకుండా చర్యలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉదా.బాస్కరరావు, కృష్ణ, గోపాలరావు, ప్రసాదరావు, శివలక్ష్మి, సంపత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవున్ని దర్శించిన జాయింట్ సెక్రటరీ విద్యావతి

అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్ని బుధవారం మినిస్ట్రీ ఆఫ్ ఇన్విరోన్మెంట్ ఫారెస్ట్ క్లయిమేట్ జాయింట్ సెక్రటరీ వి.విద్యావతి శ్రీ స్వామివార్ని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆమెకు ఆలయ మర్యాదలతో దేవస్థానం ఏసి ఈరంకి.జగన్నాధరావు ఘన స్వాగతం పలికారు.దర్శనానంతరం వేద పడితులు వేదాశీస్సులు అందజేశారు.అనంతరం ఏసి ఈరంకి.జగన్నాధరావుశ్రీ స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

# ఏయూలో జాతీయ కార్యశాల




విశాఖపట్నం: ఏయూ సంగీత నృత్య విభాగం, బెంగుళూరుకు చెందిన ప్రభాత రీసెర్చ్ ఫౌండేషన్, రినైజెన్స్ యూనివర్సల్ సంయుక్తంగా ఈ నెల 14,15 తేదీల్లో జాతీయ కార్యశాల నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆచార్య కె. రామమోహనరావు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14వ తేదీన కార్యశాలను వర్సిటీ వీసీ జి నాగేశ్వరరావు ప్రారంభిస్తారని, 15న ముగింపు సభకు వర్సిటీ రిజిస్ట్రార్ కె.నిరంజన్ హాజరవుతారని పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఆచార్య సరస్వతి విద్యార్థి మాట్లాడుతూ ఆనంతరమార్గ్ వ్యవస్థాపకులు ప్రభాత్ రంజన్ సర్కార్ స్వరపరిచి, రచించిన 5018 గీతాలను ఆలపించడం, అభ్యసించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల సంగీతాభిమానులు హాజరు కావచ్చన్నారు. రినైజెన్స్ యూనివర్సిల్ కార్యదర్శి నారాయణ పాండా మాట్లాడుతూ ఆనంద్‌మార్గ్ జనరల్ సెక్రెటరీ అవధూత ఆచార్య భవేశానంద ప్రసంగం ఉంటుందన్నారు. ముగింపు కార్యక్రమంలో అవధూతిక ఆనంద అభిష ఆచార్య, ప్రభాత్ సంగీత సీనియర్ అధ్యాపకులు డి దేబ్‌నాథ్, ఎస్. హాల్డర్ తదితరులు ప్రసంగాలు, శిక్షణ ఉంటాయని తెలిపారు.

## ఎమ్మెల్యే గణబాబు చొరవతో

# ఎన్ ఏ డి ట్రాఫిక్ కష్టాలకు మార్గం సుగమం



విశాఖపట్నం: ఎన్ ఏ డి విశాఖ వెస్ట్ ఎమ్మెల్యే ప్రభుత్వ విఫ్ గణబాబు చొరవతో పెందుర్తి గోపాలపట్నం ఎన్ ఎ డి మీదుగా రాకపోకలు చేసి ప్రయాణీకులకు కష్టాలు తీరనున్నాయి ఎన్ ఎస్ టి ఎల్ డైరెక్టరుని కలిసి వారిబృందంతో సుదీర్ఘంగా చర్చలు అనంతరం అధికారులు అంగీకారం తెలిపారు. ఎన్ ఎస్ టీ ఎల్ ప్రహరీ గోడను తొలిగించి ఆ మార్గంగుండా వాహనాల రాకపోకలను మళ్లించనున్నారు. సుమారు 20 సంవత్సరాలగా పరిష్కారంకాని పనిని ఎమ్మెల్యే చక్కదిద్దటంతో నియోజకవర్గ ప్రజలు వాహన దారులు హర్షం వెళ్లబుచ్చుతున్నారు.

# ఎస్ఎఫ్ఐ మండల కార్యవర్గ సమావేశం

అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ శంఖవరం మండలం మహాసభ స్దానిన దేవస్థానం హైస్కూల్ నందు ఎస్ఎఫ్ఐ శంఖవరం మండల కార్యదర్శి బి.శివరాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యకరమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన హైస్కూల్ ప్రదానోపాద్యాయులు అల్లాడ.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి ఎస్ఎఫ్ఐ అనేక పోరాటాలు చేస్తుందని అన్నారు. అలాగే ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.రాజా మాట్లాడుతూ దేశంలో నేటికీ చదువుకునే విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉందని అన్నారు. అలాగే విద్యారంగానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు తక్కువగా కేటాయించడం దారుణమైన విషయమని అన్నారు.అదేవిధంగా రాష్ట్రంలోని ఎయిడెడ్ విద్యాసంస్థల పరిరక్షణ ప్రభుత్వమే భాద్యత తీసుకోవాలని,రాష్ట్రంలోని విద్యారంగానికి నిధులు కేటాయించి అందరికీ ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహయ కార్యదర్శి ఎమ్.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఆనంద్, అర్జుకుమారి, అనూష మరియు ఎస్ఎఫ్ఐ మండల నాయకులు అనూష, సత్య, నాగలక్ష్మి, బద్రి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక హెూదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

## కాంగ్రెస్ విజయోత్సవంలో ద్రోణంరాజు శ్రీనివాస్



విశాఖపట్నం: రాహుల్ గాంధీతోనే ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేక హెూదా వస్తుందని, కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ అన్నారు. నేడు ప్రజలు మూడు రాష్ట్రాలలో బీజెపీని తరిమికొట్టి, కాంగ్రెస్‌కు విజయంఅందించిన సందర్భంగా నగర పార్టీ కార్యాలయంలో విజయోత్సవాలు నిర్వహించారు. ప్రజలు బీజేపీని గద్దె దించాలని చూస్తున్నారనడానికి ఈ ఫలితాలే నిదర్శనమని తెలిపారు. రాహుల్ సారధ్యంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుందన్నారు. తెలంగాణాలో ఆశించిన ఫలితాలు రానప్పటికీ కాంగ్రెస్‌కు సీట్లు పెరిగాయన్నారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బెహరా బాస్కరరావు మాట్లాడుతూ ఐదు రాష్ట్రాలలో బీజేపీని అనర్హలని తీర్పు ఇచ్చిన ప్రజలకు దన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బిజేపీ పాలన దుయ్యబట్టారు. 2019లో రాహుల్ గాంధీ దేశప్రధానీ అవుతారని చెప్పటానికి ఇది ఒక ఉదాహరణ అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహిళా నగర అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, వుడా రవి, విజయచంద్ర, పీసీసీ కార్యదర్శి శివకుమార్, కంటు ముచ్చు తాతారావు, యర్రం శెట్టి శ్రీనివాస్, చోడదాశి సుధాకర్, గొంప గోవింద్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# దశాబ్దాల కల నెరవేరింది ..

## ఎమ్మెల్యే గణబాబు ..
## ఎన్ యెస్ టి ఎల్ ప్రహరీగోడ  తొలగింపు .. ప్రారంభం ..



కంచరపాలెం  : ఎన్నో ఏళ్ల దశాబ్దాల కల నెరవేరిందని పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు పి గణబాబు పేర్కొన్నారు .ఈ మేరకు దీంతో బుధవారం ఉదయం యుద్ధప్రాతి పదికిన ఎన్ ఎస్ టి ఎల్  ప్రహరీ గోడ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి .నగరంలో నిత్యం రద్దీగా ఉండే కూడళ్లలో ఎన్ ఏ డి జంక్షన్ ప్రధానమైనది నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఇటీవల ఇక్కడ  ఫ్లై ఓవర్ పనులు ప్రారంభం కావడంతో ట్రాఫిక్ మరీ రద్దీగా పెరిగింది .ఈ కూడలిలో పిల్లర్ల సంఖ్య నిర్మాణం  పెరుగుతున్న కొద్దీ ట్రాఫిక్ కష్టాలు మరింత పెరిగాయి అయితే ఎన్ ఎస్ స్టీల్ బైపాస్ రహదారి ప్రారంభం అవడానికి ఇంకా కొన్ని గంటలే ఉన్నాయి .ఎన్ ఏ డి  ట్రాఫిక్ సమస్య తాత్కాలికంగా  తీర్చుటకు  శ్రీకారం చుట్టనున్నట్టు శ్రీకారం పేర్కొన్నారు.

.గోపాలపట్నం నుంచి నగరము లోకి వెళ్లే ప్రయాణికులకు కొంత మేర  కష్టాలు తొలగనున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు .బిఆర్టిఎస్ రహదారికి ప్రత్యాన్మాయముగా  ఏర్పాటు చేసిన ఈ రహదారికి ఎన్ ఎస్ టి ఎల్  గోడ అడ్డంగా ఉండేదని అయితే దీనిని  ఎమ్మెల్యే ప్రతిష్టాత్మంగా  తీసుకుని  ఈ  సమస్యను  త్వరతగతిన పరిష్కరించినందుకు స్థానికులు హర్షధ్వానాలు వ్యక్తం చేస్తున్నారు .ఈ ప్రహరీ గోడ  తొలగించుటకు రక్షణ శాఖ అనుమతులు సైతం త్వరతిగతిన తీసుకున్నామని ఈ గోడ లోపల ప్రహరి గోడ నిర్మాణ పనులు ఇప్పటికే త్వరితగతిన పూర్తి చేశామని వాటి స్థానంలో నూతన గేట్లు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు .ఈ బైపాస్ రహదారి గోపాలపట్నంలోని కుమారి  కళ్యాణ మండపం వద్ద ప్రారంభమై ఇందిరా నగర్, లక్ష్మీనగర్, సుసర్ల కాలనీ ,ఏపీ ఎస్సీబీ కోలని  మీదుగా  జాతీయ  రహదారికి  అనుసంధానం అవుతుందని ప్రారంభ మార్గానికి కొన్ని గ ృహాలు  అడ్డంగా ఉండటంతో ఇదివరకే జిఎంసి అధికారులతో చర్చించి వారికి ప్రచ్చన్న ఏర్పాటు చేశామని పేర్కొన్నారు ఇప్పటి కే ఇక్కడ  ఉన్న కొండ ప్రాంతాన్ని చదును  చేశామని దాని వద్ద త్వరలో నూతన రహదారి నిర్మాణం చేపడుతుందని పేర్కొన్నారు .

ట్రాఫిక్ సమస్యను  పూర్తిగా అదుపులోకి తీసుకువస్తామని ఈ సందర్భంగా ప్రజలకు భరోస ఇచ్చారు ఎన్ఏడీ జంక్షన్ నాలుగు రోడ్ల కూడలి వద్ద ట్రాఫిక్ సమస్య ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నందున కొంత ఇబ్బందిగానే ఉన్నదని పేర్కొన్నారు .ముఖ్యంగా ఎన్ఎడి కూడలి వద్ద తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలపై ఇప్పటికే  ఆరా తీశామని ట్రాఫిక్ జాము గల కారణాలను గుర్తించామని  త్వరలో జీఎంసి ప్రణాళిక తెప్పించుకుని తమ ఉన్నతాధికారులతో  ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టుటకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు . ముఖ్యంగా ఆధునిక సిగ్నల్స్ ఏర్పాటు చేయుటకు ట్రాఫిక్ సమస్యను కు అడ్డంగా ఉన్న భవనాలను దుకాణాలను తొలగించుటకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు .సాయంత్రం నుండి అధికారికంగా ఈ ప్రహరీ నిర్మాణాన్ని బైపాస్ రోడ్ ని ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు .ఈ కార్యక్రమానికి పలువురు ఉన్నతాధికారులు  వస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు ఉదయం ఎమ్మెల్యే  పర్యవేక్షించారు .ఈ కార్యక్రమంలో జోన్ 6 జోనల్ కమిషనర్ సత్యనారాణ ,టౌన్ ప్లానింగ్ ఎసిపి రామలింగారెడ్డి, ఈ నరసింహం ,బిల్డింగ్ ఇన్స్ స్పెక్టర్ రాజు  ఏ ఈ అర్చన , మరియు సిబ్బంది ఉన్నారు .





క్రిస్మస్ సంబరాలు

*31 వ వార్డు అక్కయ్యపాలెం, చాకలి గెడ్డ ఏరియాలో 31 వ వార్డు అధ్యక్షులు షేఖ్.జుబేర్ ఆధ్వర్యంలో  క్రిస్మస్ సంబరాలు జరిగాయి ఈ కార్యకరమానికి ముఖ్య అతిథిగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త  కె.కె.రాజు మరియు కొండా రాజీవ్ గాంధీ,నాగమణి, పాల్గొన్నారు.*

# కేంద్రంలో బిజెపి ఓడిపోక తప్పదు



బిజి.కొండూరు (గడ్డమణుగు):- కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి ఓటమి తప్పదని ఇటీవల జరిగిన 5రాష్ట్రాల ఎన్నికలు ఈ విషయాన్ని వెల్లడి చేశాయని ఎపి జలవనరుల శాఖా మంత్రి దేవినేని  ఉమామహేశ్వరరావు  తెలిపారు. బుధవారం నాడు జి.కొండూరు మండలం, గడ్డమనుగు గ్రామంలో జరిగిన గ్రామదర్శిని - గ్రామ వికాసం, ఆదరణ పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ప్రత్యేక హెూదాని ఎగ్గొట్టి, విభజన హామీలను మరచిన ప్రధాని మోదీకి 2019 గుణపాఠం తప్పదని, హెచ్చరించారు. కేంద్రం నుండి సహకారం  లేకపోయినా  ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు రాష్ట్ర అభివ ృద్ధి కోసం శ్రమిస్తున్నట్లు తెలిపారు. గతంలో గ్రామాలలో ఎల్.ఇ.డి. బల్బులు చూశారా అంటూ ఉమా ప్రజలను అడిగారు. ఎల్.ఇ.డి. బల్బులు ఇస్తామని హామీ ఇవ్వకపోయినా, చంద్రబాబు గ్రామాలను ఎల్.ఇ.డి. బల్బులతో పున్నమిని తలపించేలా చేశారని కొనియాడారు. చంద్రన్న బీమా నిరుపేదలకు వరంలాంటిదని, ఒక్క గడ్డమనుగు గ్రామానికే చంద్రన్న బీమా క్రింద 37 లక్షలు వచ్చాయని చెప్పారు. పిల్లలను బాగా చదివించాలని, వారు మట్టిలో మాణిక్యాల వంటివారని అంటూ 3 కోట్ల 59 లక్షలతో బిసి రెసిడెన్షియల్ పాఠశాల తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ సంవత్సరమే వీటిని ప్రారంభిస్తామని చెప్పారు. క్రింది స్థాయి అధికారులు సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు బాసటగా నిలిచి వారికి సహాయ సహకారాలు అందించాలని ప్రజా విజ్ఞప్తులను ప్రేమతో పట్టించుకోవాలని హితవు పలికారు. తన చుట్టూ నాయకులు తిరగొద్దని, జనం చుట్టూ తిరిగితే గ్రామాలకు, పార్టీకు మేలు జరుగుతుందని సూచించారు. గడ్డమనుగు రాక సందర్భంగా మంత్రి ఉమాను గ్రామస్థులు పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలికి, బంతిపూల వర్షం కురిపించారు. మహిళలు హారతులు ఇచ్చి ఆశీర్వదించారు.బి

# విశాఖపట్నం పోర్టు ట్రస్టును సందర్శించిన నేపాల్ బృందం



విశాఖపట్నం : విశాఖపట్నం పోర్టు ట్రస్టును నేపాల్ బృందం సందర్శించింది. నేపాల్ విశాఖల మధ్య సరుకు రవాణా కోసం గత కొన్ని నెలలుగా జరుగుతున్న ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు నేపాల్ బృందం సభ్యులు విశాఖ పోర్టుకు విచ్చేశారు. విశాఖపట్నం పోర్టు చైర్మన్ ఎంటి కృష్ణబాబు నేపాల్ బృందానికి సాదర స్వాగతం పలికారు. నేపాల్ రాయబారి శ్రీ భరత్ కుమార్, ఎకనామిక్ కౌన్సలర్ శ్రీ తీర్థ ప్రకాశ్ పౌడల్ లు పోర్టును సందర్శించిన నేపాల్ బృందంలో ఉన్నారు.

విశాఖపట్నం పోర్టులో ఉన్న మౌలిక వసతులు అవకాశాలు కార్గో హ్యాండ్లింగ్ కంటైనర్ల ద్వారా నేపాల్ కు సరుకు రవాణా  వంటి అంశాలను పోర్టు చైర్మన్ నేపాల్ బృందానికి వివరించారు. అతి తక్కువ ధరలకు విశాఖ పోర్టు నుంచి నేపాల్ కు ఏ విధంగా సరుకులను రవాణా చేస్తోంది దీని ద్వారా కోల్ కతా పోర్టుతో నెలకొన్న పోటీ తదితర అంశాలను చైర్మన్ వివరించారు. ఇటీవలె నేపాల్ లో నిర్వహించిన నేపాల్ ట్రేడ్ మీట్ కు హాజరైన సందర్భంగా విశాఖ నుంచి సరకు రవాణా పై నేపాల్ స్టేక్ హోల్డర్ లు సంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని చైర్మన్ గుర్తు చేశారు. నేపాల్ కు సంబంధించిన ఒక కార్యాలయాన్ని విశాఖ లో ఏర్పాటు చేయాలని తద్వారా ఎగుమతులు దిగుమతులకు సంబంధించి త్వరిత గతిన నిర్ణాయాలు తీసుకునేందుకు వీలు కలుగుతుందని చైర్మన్ నేపాల్ బృందానికి వెల్లడించారు. విశాఖలో ఒక వాణిజ్య సమావేశాన్ని నిర్వహించి ఆ సమావేశానికి నేపాల్ స్టేక్ హోల్డర్స్ ను అహ్వానించి ఇక్కడి ఎగుమతులు దిగుమతులు వసతుల వివరాలను వారికి తెలియజేసే విధంగా ఏర్పాటు చేయాలని పోర్టు అధికారులకు పోర్టు చైర్మన్ సూచించారు.

నేపాల్ రాయబారి శ్రీ భరత్ కుమార్ రెజ్ మీ మాట్లాడుతూ ముందుగా పోర్టు చైర్మన్ కు ధన్యవాదాలు తెలిపారు. విశాఖపట్నం పోర్టు ట్రస్టు పనితీరు, కార్గో హ్యాండ్లింగ్ జరిగే తీరు, గతంలో నేపాల్ బృందం పర్యటించినప్పటికీ ఇప్పటికీ వచ్చిన మార్పులు సమస్యల పరిష్కారం వంటి అంశాలను పరిశీలించేందుకు ఇక్కడకు వచ్చినట్లు వెల్లడించారు. ఏడాదిన్నరగా విశాఖపట్నం పోర్టు ట్రస్టు నేపాల్ ల మధ్య వాణిజ్య బంధం పెరుగుతూ వస్తోందని ఎగుమతులు దిగుమతుల మొత్తం పెరిగిందని ఆయన వెల్లడించారు. సాధ్యమైనంత ఎక్కువగా విశాఖపట్నం పోర్టు ట్రస్టు సేవలను నేపాల్ వినియోగించుకుంటుందని ఆయన అన్నారు. విశాఖపట్నం పోర్టు ట్రస్టు చైర్మన్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



# వాడపల్లి వెంకన్న ఆదాయం 39 లక్షలు

రావులపాలెం : ఆత్రేయపురం మండలం, వాడపల్లిలో వేంచేసియున్న ఏడు శనివారముల వెంకన్న, కోనసీమ తిరుపతిగా భాసిల్లుతున్న వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఆలయ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, దేవాదాయ శాఖ తనిఖీ అధికారుల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు.

ఈ హుండీ లెక్కింపులో 28 రోజులకు హుండియల్స్ ఆదాయం 39 లక్షల 41 వేల 064 రూపాయలు రాగా ప్రధాన హుండీల ద్వారా 27 లక్షల 06 వేల 549 రూపాయలురాగా అన్నదాన పథకానికి 12 లక్షల 34 వేల 515 రూపాయలు వచ్చినట్లు వారు తెలిపారు.  ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు, కమిటి సభ్యులు, గ్రామస్తులు, పెద్ద ఎత్తున భక్తులు వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సీపట్నంలో ట్యాంక్ బండ్ నిర్మాణానికి శంకుస్థాపన

నర్సీపట్నం : నర్సీపట్నం పెద్దచెరువు వద్ద ట్యాంక్ బండ్ నిర్మాణానికి బుధవారం రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు శంకుస్థాపన చేశారు. ట్యాంకు బండ్ మంజూరుకు టెండర్లు వేసినప్పటికీ ఏ ఒక్కరు ముందుకు రాలేదన్నారు. విశాఖపట్నంకు చెందిన కాశీ అనే కాంట్రాక్టర్ దీన్ని పూర్తి చేయడానికి ముందుకు వచ్చారన్నారు. రెండు మూడు నెలల్లో దీన్ని పూర్తి చేస్తారని తెలిపారు. దీంతో పాటు నాలుగు లైన్ల రోడ్డు వెడల్పు, మధ్యలో ఎల్ఇడి లైట్లతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్శన్ లాలం భవానీ భాస్కర్, నర్సీపట్నం ఆర్డీవో .విశ్వేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడిగర్ల అప్పలనాయుడు, రోడ్లు భవనాలశాఖ ఎస్ఇ పి.మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అందరినీ ఒక ఇంటివారిని చేస్తా

## - ఎమ్మెల్యే పంచకర్ల



యలమంచిలి: పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వ హాయంలో  ముఖ్యమంత్రి  చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే మరియు టీడీపీ రూరల్ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యలయంలో ఏర్పాటు చేసిన గ్రూప్ హౌస్ లబ్ధిదారుల డ్రా కార్యక్రమంలో పాల్గొని 189 మందికి పట్టాలను అందించారు. ఈ  సందర్భంగా  ఎమ్మెల్యే  పంచకర్ల మాట్లాడుతూ  ముఖ్యమంత్రి  చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన పేదవాడి సంక్షేమ పథకాలు అందరికి అందాలనే ఉద్దేశం తో ఇళ్లులేనివారికి నిర్మాణాలు చేపట్టి అంద జేయడం జరుగుతుందని అన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి కృషి పట్టుదలతో ఇళ్ల నిర్మాణాలను చేపట్టారన్నారు. అలాగే నూతనంగా మంజూరు కాబడిన 14 మంది ఒంటరి మహిళలకు పెన్షన్ ప్రొసీడింగ్స్‌ను మరియు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కె. విజయబాబు, ధూళి రంగనాయకులు, కొఠారు సాంబ, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రాజు, పిట్టా శ్రీను, మళ్ల కొండబాబు, ఇతర వార్డు కౌన్సిలర్లు, టిట్కో అధికారి శ్రీనివాసరావు, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



## సరికొత్త 125 డ్యూక్ ఎబిఎస్ ఆవిష్కరణ



విశాఖపట్నం : అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న కెటిఎం 125 డ్యూక్ ఎబిఎస్ బైక్‌ను (390 డ్యూక్ కెటిఎం), రామాటాకీస్ షోరూంలో ఆవిష్కరించారు. యూరోప్‌లో నెంబర్ 1 మోటార్‌సైకిల్ బ్రాండ్, కెటీఎం, 2012లో భారత దేశంలో ఆవిష్కరింపబడిన నాటినుంచి అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న స్పోర్ట్స్ మోటార్ సైకిల్ బ్రాండ్‌గా నిలిచింది. కెటిఎం 125 డ్యూక్ 14.5 పిఎస్.పవర్‌తో ధృడమైన మరియు తేలికైన ట్రెల్లిస్ ఫ్రేమ్ క్రాఫ్ట్‌మన్‌షిప్‌తో మరియు అల్యూమినియం స్వింగ్‌ఆర్మ్ మరియు ఈ శ్రేణి బైక్‌లలో లేని ప్రీమియం ఎక్విప్‌మెంట్‌తో ఇది రూపొందించబడింది. ఈ సందర్భంగా వరుణ్ బజాజ్ సిఇవో శ్రీనివాస్ మాట్లాడుతూ, కెటిఎం బైక్‌లు ఎల్లప్పుడూ అత్యుత్తమ సామర్థ్యంతో ఆకర్షణీయమైన ఎడ్జీ డిజైన్‌తో థ్రిల్లింగ్ రైడ్ అనుభూతిని అందిస్తాయని తెలిపారు. సరికొత్త 125 డ్యూక్ రూ.1.18.355 ధరకే (ఎక్స్ షోతరూం, వైజాగ్) లభిస్తోందని తెలిపారు.

## సింధు జైత్రయాత్ర మొదలు

### బ్యాడ్మింటన్ వరల్డ్ టూర్ ఫైనల్స్

గ్వాంగ్జౌ (చైనా): భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు వరల్డ్ టూర్ ఫైనల్స్‌ను విజయంతో మొదలు పెట్టింది. మహిళల సింగిల్స్ గ్రూప్-ఏలో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అకానె యమగూచిపై 24-22, 21-15 తేడాతో గెలుపొందింది. పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ 18-21, 6-21 తేడాతో ప్రపంచ ఛాంపియన్ కెంటో మొమోటా చేతిలో ఓడాడు. సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిల్ గెలవడంతో అతడు ఈ ప్రతిష్ఠాత్మక పోరుకు అర్హత సాధించాడు. భారత్ నుంచి కిదాంబి శ్రీకాంత్ తర్వాత టోర్నీ ఆడిన రెండో షట్లర్ అతడే.సింధు, యమగూచి పోరు హోరాహోరీగా సాగింది. మూడో సారి టోర్నీలో అడుగు పెట్టిన సింధు తొలి గేమ్‌ను 27 నిమిషాల్లో ముగించింది.

### నేత్ర విద్యాలయ (అంధుల పాఠశాల)కు

## సిఎంఆర్ గ్రూప్ స్కూలు బస్సు బహూకరణ



విశాఖపట్నం : విశాఖపట్నం జిల్లా, మంగమారిపేట గ్రామానికి చెందిన వారిజ ఆశ్రమంలో సుమారుగా 114మంది అంధ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారు విద్యా మరియు ఆటపాటలన్నింటిలోనూ జాతీయస్థాయిలో ముందంజలో ఉన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం సిఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ 23 సీట్లు గల స్కూలు బస్సును నేత్ర విద్యాలయానికి శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి వారి చేతుల మీదుగా బహూకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నేత్ర విద్యాలయ కమిటీ ప్రెసిడెంట్ పిఎస్ఎన్.రాజు, సెక్రటరీ శిరీష, ప్రధాన ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి, కమిటీ మెంబర్లు అరుణ, నారాయణరెడ్డి, రామానుజం, ఎంఎస్ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.



### ప్రపంచంలోనే తొలి మెడ్ టెక్ జోన్

# నేడే జాతికి అంకితం

- 270 ఎకరాలలో 18 హైఅండ్ టెస్టింగ్, రీసెర్చి లేబరేటరీలు, వరల్డ్ వైడ్ కౌన్సిల్స్, అత్యాధునిక వైద్య పరికరాలు తయారు చేసే 250 కంపెనీలు ఏర్పాటుకు చర్యలు
- రానున్న రోజులలో అత్యాధునిక వైద్య పరికరాలు ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేసేందుకు కేంద్ర బిందువు కానున్న మెడ్ టెక్ జోన్
- వైద్య పరీక్షల ఖర్చులు భారీగా తగ్గి సామాన్య మానవునికి పెద్ద ఎత్తున లబ్ధి చేకూర్చే అవకాశం
- దేశంలోనే తొలిసారిగా మెడికల్ డివైజెస్ పై 3 రోజుల డబ్ల్యూహెచ్వో ఫోరం మెడ్ టెక్ జోన్లో 120 దేశాల నుండి 2 వేల మంది ప్రతినిధులు సదస్సుకు హాజరు
- తోలి రోజు రాష్ట్ర ముఖ్య మంత్రి, రెండో రోజు కేంద్ర మంత్రి సురేష్ ప్రభు, మూడో రోజు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి ముఖ్య అతిధులుగా హాజరు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్య
- మెడ్ టెక్ జోన్ మేనేజింగ్ డైరెక్టర్ జితేంద్ర శర్మ





విశాఖపట్నం: ప్రపంచంలోనే తొలిసారిగా అత్యధిక వైద్య పరికరాలను ఒకే చోట తయారుచేసి వివిధ దేశాలకు ఎగుమతి చేసేందుకు విశాఖ నగరంలో ఏర్పాటు చేసిన మెడ్ టెక్ జోన్ గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పూనం మాలకొండయ్య తెలిపారు. బుధవారం పెదగంట్యాడ లోని మెడ్ టెక్ జోన్ లో మేనేజింగ్ డైరెక్టర్ జితేంద్ర శర్మతో కలిసి తో కలిసి ఆమె పాత్రికేయులతో మాట్లాడారు. 270 ఎకరాలలో 18 ప్రఅస్త్రప్త వఅం టెస్టింగ్, రీసెర్చి లేబరేటరీలు, వరల్డ్ వైడ్ కౌన్సిల్స్, అత్యాధునిక వైద్య పరికరాలు తయారు చేసే 250 కంపెనీలు ఈ జోన్లో ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. రానున్న రోజులలో అత్యాధునిక వైద్య పరికరాలు ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేసేందుకు ఈ మెడ్ టెక్ జోన్ కేంద్ర బిందువు కానుందన్నారు. ఈ కేంద్రం వల్ల వైద్య పరీక్షల ఖర్చులు భారీగా తగ్గి సామాన్య మానవునికి పెద్ద ఎత్తున లబ్ధి చేకూరుతుందన్నారు. దేశంలోనే తొలిసారిగా మెడికల్ డివైజెస్ పై 3 రోజుల డబ్ల్యూహెచ్వో ఫోరంను ఈ మెడ్ టెక్ జోన్లో రేపటి నుంచి నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. 120 దేశాల నుండి 2 వేల మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతున్నారన్నారు. తోలి రోజు రాష్ట్ర ముఖ్య మంత్రి, రెండో రోజు కేంద్ర మంత్రి సురేష్ ప్రభు, మూడో రోజు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి ముఖ్య అతిధులుగా హాజరు అవుతున్నారన్నారు. మెడ్ టెక్ జోన్ మేనేజింగ్ డైరెక్టర్ జితేంద్ర శర్మ మాట్లాడుతూ 98 శాతం వైద్య పరికరాలను× పలు దేశాల ను దిగుమతి చేసుకుంటున్నామని, ఇందుకు ప్రతి ఏడాది సుమారు 30 వేల కోట్లను ఖర్చుపెడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ మెడ్ టెక్ జోన్ పూర్తిస్థాయిలో పూర్తయితే మనమే ప్రపంచంలోని పలు దేశాలకు దేశాలకు అత్యాధునిక వైద్య పరికరాలను ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతాం అన్నారు. ఇప్పటికే ఈ జోన్ లో 80 కంపెనీలు సుమారు పదివేల కోట్ల పెట్టుబడితో ఏర్పడ్డాయన్నారు. వీటి ద్వారా సుమారు వెయ్యి మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలిగాయి అన్నారు. ఈ జోన్ లో కంపెనీలు పూర్తిస్థాయిలో ఏర్పడితే, 24 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. తొలి దశ పనులు కేవలం 342 రోజుల్లో 450 కోట్లతో పూర్తి చేయడం జరిగిందని, రెండో దశ పనులు 110 కోట్ల ఎడిబి నిధులతో సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

## ధర్మాన్ని రక్షిస్తే ఆ ధర్మమే మనల్ని కాపాడుతుంది

### పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

కొయ్యూరు : ధర్మాన్ని రక్షిస్తే ఆ ధర్మమే మనందర్ని కాపాడుతుందని పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. బుధవారం మండల కేంద్రం రాజేంద్రపాలెం అల్లూరి కళామందిరం వద్ద సమరససేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన హిందూ సంస్కృతి సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గన్న ఆమె మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి జీవిస్తున్నాడంటే భగవంతుడి ఆశీర్వాదం అన్నారు. గిరిజన సాంప్రదాయంలో ముఖ్యంగా మందు, మాంసాహారం లేనిదే ఉండదని అనే ఆచారాన్ని గిరిజనులు తిరగరాశారని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గనడమే కాకుండా భగవన్నామస్మరణ చేస్తూ నిత్యం దైవరాధన చేస్తూ గిరిజన పల్లెలు చూస్తే అర్థం అవుతుందన్నారు. గిరిజన ఆడపడుచుగా నేను ఎంతో గర్వపడు తున్నానన్నారు. ఇటువంటి గిరిజన సంస్కృతి సమ్మేళనంలో పాల్గనడం నాకెంతో ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి గిరిజన హిందూ సమ్మేళనాల వల్ల ప్రజలు, గిరిజనుల్లో ఆధ్యాత్మిక పెరుగుతుందన్నారు. ప్రజలందరూ మంచి మనసుతో ఉండాలని, మనమందరం కష్టాలు వదలి ముందుకు వెళ్లాలన్నారు. భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవాలన్నారు. అనంతరం సమ్మేళనంలో పాల్గన్న గురువులు కిటుముల రామానందస్వామిజి, పెందుర్తి ధనధర్మ స్వామి జిలు ప్రసంగిస్తు నిత్యం భగవన్నా మస్మరణతో ప్రతీ ఒక్కరు ఉండాలన్నారు. తోటి మనిషికి సాయం చేయాలని ప్రతీ జీవరాశి పట్ల ప్రేమతో ఉండాలన్నారు. ఎస్ఎస్ఎస్ఎఫ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ ఇందిరాదేవి, ఎస్ఎస్ఎస్ఎఫ్ 11 మండలాల ఇన్‌చార్జ్ గంగాధర్ ప్రసంగిస్తూ ఆధ్యాత్మికం ఎంతో ఉత్తమమైందన్నారు. అందరు దైవారాధను నిత్యం చేస్తూ రామనామజపం చేయాలన్నారు. దారకొండ మస్టారు ఎల్.శివయ్య, ఎస్ఎస్ఎఫ్ సభ్యులు సన్యాసిరావు, బండారు సోమరాజు, కె.వీర్రాజు, సత్యనారాయణ, కొయ్యూరు, జికెవీధి, చింతపల్లి మండలాలకు చెందిన సుమారు 6వేల మంది భక్తులు పాల్గొన్నారు.

## హిందుజాతో ఏపీ సర్కార్ ఒప్పందం రద్దు

అమరావతి: రాష్ట్రంలో హిందుజా పవర్ కార్పొరేషన్‌తో ఉన్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం కొనసాగింపును ఏపీ సర్కార్ రద్దు చేసుకుంది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మిగులు విద్యుత్ ఉన్నందున కొనుగోలు ఒప్పందాన్నివెనక్కి తీసుకోవాలని భావించి ఈ నిర్ణయం తీసుకుంది.


LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans, Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750


## లక్షల్లో ఓట్లు గల్లంతు.. నిజం కాదు: సీఈవో

హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఓట్లు గల్లంతయ్యాయని వస్తున్న వార్తల్లో నిజం లేదని ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధానాధికారి రజత్ కుమార్ అన్నారు. సుమారు 22 లక్షల ఓట్లు గల్లంతైనట్లు మీడియాలో వచ్చిన వార్తల్లో ఏమాత్రం నిజం లేదన్నారు. రాష్ట్రంలో మొత్తం 2.81 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, మహా అయితే వందల్లో లేదా వేలల్లో ఓట్లు గల్లంతై ఉండొచ్చు గానీ లక్షల్లో అవ్వడానికి ఆస్కారం లేదన్నారు. ఒకవేళ అలా జరిగి ఉంటే ఇంత ప్రశాంతంగా ఎన్నికలు జరిగేవే కావన్నారు.

ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్‌ను గవర్నర్‌కు అందించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా, సాఫీగా జరిగాయని స్పష్టంచేశారు. రాష్ట్రంలో కొత్త అసెంబ్లీ ఏర్పాటు అయ్యిందని, ఎన్నికల కోడ్ నేటితో ముగిసిందని చెప్పారు. ఎన్నికలు విధులు ప్రశాంతంగా జరగడంలో సహకరించిన అధికారులకు క ృతజ్ఞత తెలిపారు.

ఓటర్లు ఎప్పటి కప్పుడు తమ పేర్లను సరిచూసుకుని లేనివారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నెల రోజుల్లోగా అభ్యర్థులందరూ తమ ఎన్నికల వ్యయానికి సంబంధించిన వివరాలు సమర్పించాల్సి ఉంటుందని, ఈవీఎంల ట్యాంపరింగ్‌కు ఏమాత్రం ఆస్కారం లేదని తేల్చిచెప్పారు.

## ఘనంగా ప్రారంభమైన మణికంట ఫుడ్ కోర్ట్





భీమునిపట్నం : తగరపువలస మెయన్ రోడ్ లో బుదవారం మణికంట ఫుడ్ కోర్ట్ ను విజనగిరి వై.సి.టి.మేనేజింగ్ ట్రస్టీ టి.ఎల్.నరసింహారావు, భీమిలి బ్రాంచ్ యోగా సెంటర్ సెక్రెటరీ సి.హెచ్ వెంకటరమణ లు ప్రారంభించారు. భీమిలి సి.ఐ. ఎస్.బాలసుర్యారావు, జోనల్ కమీషనర్ పి.దుర్గాప్రసాద్,లు శ్రీ మణికంట స్వీట్స్ అదినేతలు ఆదిమూలం సత్యనారాయణ, ఆదిమూలం నాగరాజులకు శుభా కాంక్షలు తెలిపారు.ఇందులో వెంపాడ.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.






VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com